మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 184 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag
Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad

బుధవారం 04 సెప్టెంబర్ 2024

ప్రజా మంటలు
తెలంగాణ జాతీయ దినపత్రిక

విలేఖరులు కావలెను
ప్రజా మంటలు జాతీయ దినపత్రికలో నిర్భయంగా వార్తలు, విశ్లేషణలు రాయగల యువకులు విలేఖరులు చిత్తశుద్ధితో పనిచేయగల వారు,
మీ పూర్వ అనుభవంతో సంప్రదించండి.
వివరాలకు కింది ఫోన్ నం లను సంప్రదించండి.
9989326427, 8103194733.



## వరదసహాయక చర్యల్లో పోలీసుల పనితీరు భేష్

**ప్రాణాలకు తెగించి పలువురిని కాపాడిన పోలీసులు**

**సీతారాం తండాలో చిక్కుకున్న 40మంది తరలింపు**

**సిరోల్ ఎస్ఐ నగేశ్‌ను సన్మానించిన సిఎం రేవంత్**

మహబూబాబాద్, సెప్టెంబర్3 (ప్రజా మంటలు): మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలతో వరదలు పొటెత్తాయి. దీంతో అధికారులు, పోలీసులు పగలు రాత్రి అని తేడా లేకుండా సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. ప్రజలకు అవసరమైన సహాయం చేస్తూ.. మిగతా 2లో..

## ఖమ్మంలో బిఆర్ఎస్ నాయకుల పర్యటన

**మాజీమంత్రి పువ్వాడ వాహనంపై రాళ్లదాడి**

**ఒకిరికి గాయాలు..ఘటనపై మండిపడ్డ కెటిఆర్**

ఖమ్మం, సెప్టెంబర్3 (ప్రజా మంటలు): తెలంగాణలో నాలుగు రోజులుగా భారీ వర్షాలు పడుతున్నాయి.



# చరిత్రలో కనీవినీ ఎరుగని ఉపద్రవం

**ఆక్రమణల వల్లే వరదల విపత్తు**

**సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌ల ప్రయారం కూల్చివేతలు**

**కేంద్ర సాయం కోసం ప్రధానిని కలుస్తా**

**ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం**

**పువ్వాడ ఆక్రమణలపై హరీష్ స్పందించాలి**

**ఖమ్మంలో మీడియాతో సిఎం రేవంత్**



ఖమ్మం, సెప్టెంబర్3 (ప్రజా మంటలు): చరిత్రలో ఎన్నడూ కనివిని ఎరుగన్నంత ఉపద్రవం సంభవించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దీనికి చెరువులు, కుంటల ఆక్రమణలు కూడా కారణమని అన్నారు. ఖమ్మంలోనే బస చేసిన సిఎం ఉదయం మీడియాతో ఆయన చిట్ చాట్ చేశారు. ఆపదలో ఉన్న తెలంగాణ ప్రజలను ఆదుకుంటామని.. ప్రజలందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు. తాను ఫామ్ హౌస్ లో పడుకున్నోడిలా కాదని పరోక్షంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై విమర్శలు గుప్పించారు. తాను చెప్పిందే చేస్తానని.. చేసేదే చెబుతానని మిగతా 2లో..






## తక్షణ సాయంగా 2వేల కోట్లు ఇవ్వండి

**వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించండి**

**కేంద్రాన్ని మరోమారు కోరిన సిఎం రేవంత్**

**మహబూబాబాద్ వరద ప్రాంతాల్లో పర్యటన**

**వరదనష్టంపై అధికారులతో సమీక్ష**

**జిల్లాల్లోనూ ఆక్రమణల తొలగింపునకు హైడ్రా**

మహబూబాబాద్, సెప్టెంబర్3 (ప్రజా మంటలు): కేంద్రం వరదలను జాతీయ విపత్తుగా గుర్తించి 2వేల కోట్లను తక్షణ సాయంగా అందించాలని సిఎం రేవంత్ రెడ్డి కోరారు. వరదనష్టం భారీగా ఉందని, 5300 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారని అన్నారు. దీనిపై ఇప్పటికే కేంద్రానికి లేఖ రాశానని, జాతీయ విపత్తుగా గుర్తించాలని కోరానని అన్నారు. మహబూబాబాద్ జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. జిల్లాలో పర్యటించిన ఆయన.. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కతో కలిసి వరదలపై సమీక్ష నిర్వహించారు. మంగళవారం నాడు మహబూబాబాద్ జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... అనంతరం మిగతా 2లో..



పొలిట్రిక్స్

ముసిరిన మబ్బులు
ముంచెత్తిన వాన ,
ప్రకృతి బీభత్సం
ప్రజలకు యాతన !

పొంగి పొర్లుతున్న
వాగులు వంకలు ,
జనజీవన ప్రవంతిలో
తప్పని అపశ్రుతులు !

- న్యాలకంటి నారాయణ
9346200066

## ప్రభుత్వ వైఫల్యం వల్లే వరదల్లో భారీ నష్టం

**ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం**

**పాలనపై పట్టులేక విపక్షాలపై సిఎం విమర్శలు**

**మృతుల కుటుంబాలకు 25లక్షల పరిహారం ఇవ్వాలి**

**ఖమ్మంలో పర్యటించిన ఎమ్మెల్యే హరీష్ రావు**

ఖమ్మం, సెప్టెంబర్ 3(ప్రజా మంటలు): ఖమ్మం నగరంలో పర్యటించిన మాజీ మంత్రి హరీష్ రావు.. రాష్ట్ర ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వ వైఫల్యం వల్లే వరదల కారణంగా భారీ నష్టం సంభవించిందన్నారు. ఖమ్మం బీఆర్ఎస్ పార్టీ ఆఫీసులో మీడియాతో మాట్లాడిన ఆయన.. మూడు నాలుగు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా జనజీవనం స్తంభించి పోయిందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం, వైఫల్యం కారణంగానే భారీ నష్టం వాటిల్లిందని విమర్శించారు. వరద బాధితులకు సహాయం చేసేందుకే తాము ఇక్కడికి వచ్చామన్నారు. తొమ్మిది మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు మంత్రులు ఉండి కూడా జిల్లా ప్రజలను కాపాడలేకపోయారని హరీష్ రావు విమర్శించారు. పాలనపై



పట్టుకోల్పోయిన సీఎం.. ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఈ నష్టం జరిగిందన్నారు. కట్టు బట్టలు తప్ప తమవద్ద ఏమీ లెవని వరద బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని హరీష్ రావు తెలిపారు. వరదల కారణంగా మరణించిన వారి కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోల్పోయిన వస్తువులకు రూ. 2 లక్షల ఆర్థిక పరిహారం ఇవ్వాలన్నారు. ఎంతో మంది విద్యార్థుల సర్టిఫికెట్లు వరదలో కొట్టుకు పోయాయని.. వారి సర్టిఫికెట్లను వారికి మిగతా 2లో..

## తెలంగాణ ఉద్యోగుల ఉదారత

**వరద బాధితులకు**

**ఉడతాభక్తి సాయం**

**ఒకరోజు వేతనం వందకోట్లు**

**విరాళం ప్రకటన** 2లో..



### ప్రముఖ చరిత్రకారుడు జైశెట్టి రమణయ్య కు సతీ వియోగం



జగిత్యాల సెప్టెంబర్ 03 (ప్రజా మంటలు) : తెలంగాణలో ప్రముఖ చరిత్రకారుడు జైశెట్టి రమణయ్య సతీమణి వరలక్ష్మి ఆకస్మికంగా మంగళవారం రోజు మరణించారు. వారికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. గత కొంత కాలంగా రమణయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు సతీవియోగం ఈదశలో తీరని వ్యధను మిగిల్చింది. ఆమె మృతికి ఎమ్మెల్సీలు జీవన్ రెడ్డి, రమణ, ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ మంత్రి రాజేశం గౌడ్, బీజేపీ నాయకురాలు బొగ శ్రావణి, శాతవాహన హైస్కూల్ ప్రిన్సిపాల్ స్మితారావు, కరెస్పండెంట్ ప్రభాకర్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం తదితరులు తమ సంతాపాన్ని తెలిపారు.

## ప్రజా నాడి






## వరద నష్టాలను అంచనా వేయండి

**అధికారులను ఆదేశించిన సిఎస్ శాంతికుమారి**

హైదరాబాద్, (ప్రజా మంటలు): రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల వలన జరిగిన ఆస్తి, ప్రాణ నష్టం వివరాలను ఈ వారాంతంలోగా సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. వర్షాలు, వరదల వలన జరిగిన నష్టం అంచనా వేయడం పై నేడు సచివాలయంలో వివిధ శాఖల కార్యదర్శులు, హెచ్ ఓ డీ లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీజీపీ డా.జితేందర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ రావు, రవీ గుప్తా, వికాస్ రాజ్, అర్వింద్ కుమార్, ముఖ్య కార్యదర్శులు దాన కిషోర్, నవీన్ మిట్టల్, కార్యదర్శులు రాహుల్ బొజ్జా, రఘునందన్ రావు, లోకేష్ కుమార్, రోనాల్డ్ రోస్, ప్రశాంత్ జీవన్ పాటిల్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, ఇప్పటికీ అనేక జిల్లాల్లో వరదలు, మిగతా 2లో..

## పెన్‌గంగ ప్రాంతంలో మంత్రి శ్రీధర బాబు పర్యటన

**బ్యాక్ వాటర్‌తోఓ నష్టం వస్తోందన్న ఎమ్మెల్యే పాయల**



ఆదిలాబాద్, (ప్రజా మంటలు): జిల్లాలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పర్యటించారు. జిల్లా సరిహద్దులో ప్రవహిస్తున్న పెన్ గంగ నది ఉధృతిని పరిశీలించారు. బ్యాక్ వాటర్‌తో వందలాది ఎకరాల పంట చేలు నీట మునిగాయని ఎమ్మెల్యే పాయల్ శంకర్ మంత్రికి వివరించారు. రైతులకు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని మంత్రి కలెక్టర్ రాజర్షి షాను మంత్రి ఆదేశించారు. అంతకుముందు పట్టణంలో మూత పడ్డ సిమెంటు పరిశ్రమను సందర్శించారు. కేంద్ర సహకారంతో పరిశ్రమను తెరిపించి స్థానికులకు ఉపాధి కల్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. మంత్రి వెంట ఎమ్మెల్యే తో పాటు కలెక్టర్, ఎస్పీ గౌష్ ఆలం, కాంగ్రెస్, భాజపా శ్రేణులు ఉన్నాయి. ఇదిలావుంటే బోథ్ ఎమ్మెల్యే అనిలాజాదవ్ మంగళవారం మండలంలో పర్యటించారు. అర్లి-టి గ్రామ శివారులో నీటమునిగిన పంటచేలను పరిశీలించారు. ఇందుకోసం వాగుదాటి పంటచేలకు వెళ్లి రైతులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నీట మునిగిన పంటలకు ఎకరాకు రూ.40వేల నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో రైతుల వారీగా పంటలను మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి



## వరద నష్టాలను అంచనా వేయండి

### అధికారులను ఆదేశించిన సిఎస్ శాంతికుమారి

వానలు తగ్గుముఖం పట్టలేదని అన్నారు. జరిగిన నష్టాన్ని వెంటనే అంచనా వేయడానికి సంబంధిత శాఖల బృందాలను క్షేత్ర స్థాయికి పంపి, తగు జీపీఎస్ కోఆర్డినేట్ లతో సహా సమర్పించాలని తెలిపారు. అదేవిధంగా, రాష్ట్ర ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు ప్రతీ జిల్లాలో స్టేట్ డిజాస్టర్ మేనేజ్మెంట్ ఫోర్స్ లను ఏర్పాటు చేయడానికి కావాల్సిన నిధులు, సిబ్బంది, పరికరాల వివరాలు వెంటనే సమర్పించాలని అన్నారు. ఈ వర్షాలు, వరదల వల్ల ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా వెంటనే తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, సీఎండీ ముషారాఫ్ అలీ, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంత రావు, పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ నర్సింహా రెడ్డి లు కూడా పాల్గొన్నారు.

## పెన్‌గంగ ప్రాంతంలో మంత్రి శ్రీధర బాబు పర్యటన

పరిశీలించి జాబితాను రూపొందించాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలో తిరిగారు. ప్రజలను పలకరిస్తూ సమస్యలపై ఆరాతీశారు. కప్పర్ల ఎక్స్ రోడ్డు సమీపంలో లోతట్టు వంతెనను పరిశీలించి రాకపోకలు నిలవకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆర్అండ్బీ అధికారులను కోరతామన్నారు. దనోరలో మృతిచెందిన మేకల నారాయణ కుటుంబీకులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మండల కన్వీనర్ నాగయ్యయాదవ్, మాజీ జడ్పీటీసీ సుధాకర్, నాయకులు లస్మన్న, సంజీవరెడ్డి, గోవర్ధన్ యాదవ్, రాకేష్, ఉల్లాస్, నరేందర్, కల్చాప్, గంగయ్య, కపిల్, అఫ్రోజ్, నితిన్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## వరదసహాయక చర్యల్లో పోలీసుల పనితీరు భేష్

వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతారాం తండాలో వరదల్లో చిక్కుకున్న 40 కుటుంబాలను పోలీసులు కాపాడారు.. వారిని సకాలంలో రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.. అంతేకాకుండా.. చాలా మందికి ఆహారం సమకూర్చారు.. దీంతో మహబూబాబాద్ జిల్లాలోని పోలీస్ అధికారులను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి సన్మానించి ప్రశంసించారు. మహబూబాబాద్ లో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి.. అధికారులను అభినందించారు. సీతారాం తండాలో వరదల్లో చిక్కుకున్న వారిని ప్రజలను ఒడ్డుకు చేర్చడంలో కీలక భూమిక నిర్వహించిన మహబూబాబాద్ జిల్లాలోని సిరోల్ ఎస్.ఐ సిహెచ్ నగేష్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు.. ఈ సందర్భంగా శాలువా కప్పి సన్మానించారు. సహాయక చర్యల్లో ప్రధాన పాత్ర వహించిన పోలీసులను రేవంత్ రెడ్డి ప్రశంసించారు.అనంతరం, వరద నీటితో కేసముద్రం ఇంటికన్నె వద్ద రైల్వే ట్రాక్ కొట్టుకుపోవడంతో కేసముద్రం, మహబూబాబాద్ టౌన్ రైల్వేస్టేషన్ లో రైలు నిలిచిపోయి ప్యాసెంజర్లు ఇబ్బంది పడకుండా తినడానికి ఆహారంతో పాటు వాటర్ బాటిల్స్, బిస్కెట్ పాకెట్స్ సమకూర్చిన సీఐలను ముఖ్యమంత్రి సన్మానించారు. రైల్వే స్టేషన్ లో ఉన్న 5300 మంది ప్రయాణికులను కాజిపేటకు తరలించిన రూరల్ సీఐ సరవయ్య, టౌన్ సీఐ దేవేందర్ లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్మానించారు. ఈరీ వర్షాల్లో ఇబ్బందులు పడ్డ బాధితులను ఆదుకునేలా చర్యలు చేపట్టిన మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ను, రాష్ట్ర ముఖ్యమంత్రి నుంచి సన్మానం అందుకున్న ఎస్ఐ నగేష్ సిఐలు సర్వయ్య, దేవేందర్ లను డిజిపి డాక్టర్ జితేందర్, శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్ ప్రశంసించారు. విధి నిర్వహణలో పలువురికి ఆదర్శంగా నిలిచారని వారిని కొనియాడారు.



## చరిత్రలో కనీవినీ ఎరుగని ఉపద్రవం

వెల్లడించారు. తక్షణ సాయంగా బాధితుల ఇంటికి బియ్యం, ఇతర నిత్యావసరాలతో పాటు పదివేల రూపాయలు పంపిస్తున్నానని తెలిపారు. తెలంగాణకు వరదల కారణంగా రూ.5438 కోట్ల నష్టం జరిగిందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. పూర్తి స్థాయి నివేదిక వచ్చిన తర్వాత ప్రభుత్వం తప్పనిసరిగా ప్రతి ఒక్క కుటుంబాన్ని ఆదుకుంటుందని రేవంత్ అన్నారు. ప్రతి ఒక్క రైతును ఆదుకుంటుందని.. ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. అమెరికా పోయి కూర్చున్నోడు తలకాయ లేకుండా మాట్లాడుతుండని విమర్శించారు. ఇప్పటికే ప్రధానమంత్రికి లేఖ ద్వారా జరిగిన నష్టాన్ని వివరించానని రేవంత్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆదుకోవాలని ఈ విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించి న్యాయం చేయాలని ప్రధాని మోదీని వెళ్లి కలుస్తానన్నారు. అనుక్షణం ఈ రాష్ట్ర ప్రజలను కాపాడుకునేందుకు కష్టపడుతున్నామన్నారు. ఈ మేరకు అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. గ్రామాలకు ప్రత్యేక బృందాలను పంపుతున్నామని రేవంత్ తెలిపారు. శానిటేషన్ దగ్గర నుంచి ప్రతి ఒక్క కుటుంబం తిరిగి కోలుకునే వరకూ అండగా నిలబడతామని వెల్లడించారు. పక్క రాష్ట్రంతో పోల్చి చూస్తే మనం చాలా మెరుగ్గా పని చేస్తామని రేవంత్ తెలిపారు. విపత్తు నుంచి ప్రజలు కాపాడుకునేందుకు అవసరమైన అన్ని రకాల వ్యవస్థలను అప్రమత్తం చేసి ఉంచామన్నారు. పనికి మాలినోడు.. తలకాయ లేనోడు అమెరికాలో కూర్చొని ఏదో మాట్లాడుతున్నాడని విమర్శించారు. 80,000 పుస్తకాలు చదివినోడు ఫామ్ హౌస్‌లో పడుకున్నాడని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంత విపత్తు జరిగితే ప్రతిపక్షంలో ఉన్నోడు నోరు మెదపలేకపోతున్నాడని విమర్శించారు. కష్టాల్లో ఉన్న ప్రజలను కనీసం కన్నెత్తి కూడా చూడలేదన్నారు. ప్రజలు అధైర్పడాల్సిన పడాల్సిన అవసరం లేదన్నారు. ఈ ప్రభుత్వం మీకు అండగా నిలబడుతుందని రేవంత్ భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లో వ్యవస్థలను చక్కదిద్దేందుకు ప్రణాళికా బద్ధమైన కృషి జరుగుతుందన్నారు. హైడ్రా ఆగదని.. ముందుకెళుతుందన్నారు. హైదరాబాద్ పట్టణాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు తీసుకోవలసిన అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. నిపుణులు.. అనుభవజ్ఞులు.. ఇంజనీర్లతో మాట్లాడుతున్నామన్నారు. తప్పనిసరిగా హైదరాబాద్‌ను మార్చి చూపిస్తామని రేవంత్ తెలిపారు. విమర్శలు చేస్తున్న హరీష్ రావు తమ పార్ట ఈనాయకుడు పువ్వాడ ఆక్రమించిన చెరవుల కబ్జాలపై మాట్లాడాలన్నారు. సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్ ప్రకారం ఆక్రమణలు గుర్తించి కూల్చేస్తామని ఈ సందర్భంగా సిఎం హెచ్చరించారు. ఆక్రమణల వల్లే ఖమ్మంలో భారీగా వరదలు వచ్చాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మున్నేరు రిటైనింగ్ వాల్ ఎత్తు పెంపుపై ఇంజినీర్లతో చర్చిస్తామని చెప్పారు. సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్స్ ద్వారా గుర్తించి ఆక్రమణలు తొలగిస్తామని వెల్లడించారు. 75 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా 42 సెం.మీ వర్షం పడిందన్నారు. ప్రభుత్వ ముందుచూపు వల్లే ప్రాణ నష్టం తగ్గిందని వివరించారు.వరదలపై మాజీ మంత్రి హరీశ్ రావు ఇష్టారీతిన మాట్లాడుతున్నారని రేవంత్ మండిపడ్డారు. భారాస నేత పువ్వాడ ఆక్రమణలపై హరీశ్ స్పందించాలని వ్యాఖ్యానించారు. ఆక్రమించిన స్థలంలో పువ్వాడ ఆస్పత్రి కట్టారని.. వాటిని తొలగించాలని ఆయనకు హరీశ్ చెప్పాలని సూచించారు. వరద సాయం కోసం కేంద్రానికి లేఖ రాసినట్లు సీఎం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల సాయం ప్రకటించినట్లు చెప్పారు. ఇదిలా ఉంటే.. వరద బాధితులకు తక్షణ సాయం కింద రూ. 10వేలు ఇవ్వాల్సిందిగా అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం వరద ప్రభావిత ప్రాంతాల్లో రెండో రోజు పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చిట్ చాట్‌లో భాగంగా ఈ ప్రకటన చేశారు.



## వరదల ధాటికి వేల ఎకరాల్లో పంటనష్టం

**నదులను తలపిస్తున్న పంటపొలాలు**

**పలు రూట్లలో ధ్వంసం అయిన రోడ్లు**

**క్షేత్రస్థాయి పర్యటనతో నష్టం అంచనాలు**

**ముందస్తుగా సహాయక చర్యల్లో అధికారులు**

వరంగల్/ఖమ్మం,సెప్టెంబర్3 (ప్రజా మంటలు):

తుఫాన్ ప్రభావ వర్షా లకారణంగా ..కేవలం రెండు రోజుల వ్యవధిలోనే వేల ఎకరాల పంటలు నీట మునిగాయని వేల కోట్ల ఆస్తి నష్టం సంభవించినట్టు అధికారులు అభిప్రాయపడుతున్నారు. క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్తే ఇది మరింత పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. ప్రస్తుతానికిముంపు ప్రాంతాల ప్రజలకు సాయం చేయడంపైనే యంత్రాంగమంతా దృష్టి పెట్టింది. మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్, సూర్యపేట, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వానలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. రోడ్లను నామరూపాల్లేకుండా చేశాయి. పంట పొలాలు నదులను తలపిస్తున్నాయి. భవనాల్లోని రెండో అంతస్తుల్లోకి నీరు వచ్చి చేరింది. చెరువులకు చాలా ప్రాంతాల్ల గండ్లు పడ్డాయి. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా విధ్వంసం జరిగిందని ప్రభుత్వం చెబుతోంది. బాధిత ప్రజలు కోలుకున్న తర్వాత వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారుల బృందాలు పర్యటించి నష్టాన్ని అంచనా వేయనున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టాల్లో ప్రధానమైంది పంట నష్టాలు. సమారు నాలుగున్నర లక్షల ఎకరాల్లో పంటలు నీటమునిగినట్టు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఇది ప్రాథమిక అంచనా మాత్రమేనని ఇంకా క్షేత్రస్థాయి పరిశీలన చేస్తే మాత్రం ఇది మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఈ లెక్కన నాలుగున్నర కోట్లపైగానే నిధులు కావాల్సి ఉంటుంది. వరద నష్టాల్లో ఇది ప్రధానమైంది. వరద నష్టాల్లో రెండో ప్రధానమైంది దెబ్బతిన్న భవనాలు. ఇప్పుడు చాలా మంది ప్రజల ఇళ్లు నేలమట్టమయ్యాయి. మరికొన్ని నీట మునిగి దెబ్బతిన్నాయి. వాటిని గుర్తించి వారికి పరిహారం ఇవ్వాల్సి ఉంటుంది. దీనిపై కూడా ప్రభుత్వం ఓ అంచనాకు వచ్చింది. ఇలా దెబ్బతిన్న భవనాల్లో ప్రభుత్వ భవనాలు కూడా ఉంటాయి. ఇవి మాత్రం నేరుగా వెళ్లి పరిశీలించిన తర్వాత అంచనాకు రాగలమని అధికారులు చెబుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో భారీగా రోడ్లు దెబ్బ తిన్నాయి. దాదాపు దీని నష్టం రెండువేల కోట్లకుపైగానే ఉంటుందని, వంతెనలు మరో ఏడు వందల కోట్లు నష్టం జరిగి ఉంటుందని అంటున్నారు. పంచాయతీ రోడ్లు, మిషన్ భగీరథ పైపులైన్ల పునరుద్ధరణకు దాదాపు 200 కోట్లు అవసరం అవుతాయని అధికారులు లెక్కగడు తున్నారు. వరదల కారణంగా ట్రాన్స్‌కోకు భారీ నష్టం వాటిల్లింది. ఎక్కడికక్కడ వైర్లు తెగిపడ్డాయి. స్తంభాలు కూలిపోయాలి. ట్రాన్స్‌ఫార్మర్స్ దెబ్బతిన్నాయి. విద్యుత్ సబ్‌స్టేషన్లు కూడా నీట మునిగి పోయాయి. ఈ రిపేర్ల కోసం దాదాపు 150 కోట్లకుపైగానే నిధులు అవసరం అవుతాయి. వీటితోపాటు ఆసుపత్రుల్లో జరిగినష్టం, వీధిలైట్లు, డ్రైనేజీలు, ఇతర నష్టాలు దాదాపు 15 వందల కోట్లకుపైగానే ఉండొచ్చని ప్రాథమికంగా అంచనాకు వస్తున్నారు అధికారులు. ఓవరాల్‌గా చూసుకుంటే మాత్రం ఆరు వేల కోట్ల వరకు నష్టాన్ని ఇప్పటికి అంచనా వేస్తున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. వాతావరణ హెచ్చరికలతో అప్రమత్తమై ప్రాణ నష్టాన్ని తగ్గించగలిగామని ఆస్తి నష్టాన్ని మాత్రం తగ్గించలేకపోయామని అంటున్నారు. అయితే ఇంకా కొన్ని ప్రాంతాల్లో రహదారులు దెబ్బతిని రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. కుమ్రంభీం జిల్లాలో తెలంగాణ- మహారాష్ట్ర నేషనల్?హైవే పెనుగంగా నది నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆదిలాబాద్ జిల్లాలో కూడా చాలా ప్రాంతాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. వీటి పనులను కూడా యుద్ధప్రాతిపదికన చేస్తున్నారు.

## ఖమ్మంలో బిఆర్ఎస్ నాయకుల పర్యటన

ఏకధాటిగా కురుస్తున్న వానలతో ఖమ్మం జిల్లాలోని మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో పలు కాలనీలు జలమయం అయ్యాయి. కాలనీల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బాధితులను ప్రభుత్వం అండగా నిలిచి సహాయ కార్యక్రమాలు చేపట్టింది. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు ఖమ్మం జిల్లాలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. అయితే ఈ పర్యటనలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వాహనంపై కొంతమంది వ్యక్తులు రాళ్ల దాడి చేశారు. ఈ దాడిలో బీఆర్ఎస్ నేతలకు గాయాలు అయ్యాయి. ఒకరికి కాలు విరగడంతో ఆస్పత్రికి తరలించారు. దాడి జరిగిన మంచి కంటి నగర్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఖమ్మంలో బీఆర్ఎస్ నేతలపై దాడిని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ఈరోజు కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ మాజీ మంత్రులు హరీష్‌రావు, పువ్వాడ అజయ్ కుమార్, సబితా ఇంద్రారెడ్డి వాహనాలపై దాడి చేయటం కాంగ్రెస్ అసహనానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రజలకు సాయం చేయటం చేతగాక.. సాయం చేస్తున్న నేతలను చూసి ఓర్వలేకే ఈ దాడికి తెగబడ్డారని విమర్శలు చేశారు. ప్రభుత్వం ప్రజలను నిర్లక్ష్యం చేస్తే వారికి తాము అండగా ఉండటమే తప్పా? అని ప్రశ్నించారు. ప్రజలకు సేవ చేయటం చేతకాదు…సేవ చేసే వాళ్లపై మాత్రం దాడి చేయటం? సిగ్గు చేటు అని అన్నారు. ఈ దాడికి ముఖ్యమంత్రితో సహా కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు ఎన్ని చేసినా సరే…ప్రజల వద్దకు బీఆర్ఎస్ శ్రేణులను వెళ్లకుండా ఆపలేరని హెచ్చరించారు. కాంగ్రెస్ చేతగాని, దద్దమ్మ పాలనను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఈ ప్రభుత్వానికి సరైన సమయంలో బుద్ధి చెప్పటం ఖాయమని కేటీఆర్ వార్నింగ్ ఇచ్చారు.

### ప్రభుత్వ వైఫల్యం వల్లే వరదల్లో భారీ నష్టం

ఇప్పించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. వరద బాధితులకు కనీసం మంచినీళ్లు, అన్నం కూడా అందించలేకపోయారని ప్రభుత్వం తీరుపై హరీష్ రావు ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ లోపం కారణంగా ఈ ఘోరం జరిగిందని హరీష్ రావు విమర్శించారు. వరదల కారణంగా 28 మంది చనిపోతే.. ప్రభుత్వం మాత్రం 16 మందిని మాత్రమే చూపిస్తోందని ఆరోపించారు. భక్త రామదాసు, పాలమూరు ప్రాజెక్టులు మునిగిపోయాయని.. దీనంతటికీ కారణంగా రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే అని తూర్పారబట్టారు. ప్రభుత్వ నిర్లక్ష్యం ధోరణి కారణంగా వేల ఎకరాల్లో పంట నీట మునిగిందన్నారు. పొంగలేటి శ్రీనివాస్ రెడ్డి గతంలో పంట నష్టానికి రూ. 30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారని.. ఇప్పుడు పంట నష్టానికి ఎకరాకు రూ. 30 వేలు ఇవ్వాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. అలాగే పొలాలు బాగు చేసుకోవడానికి రూ. 50 వేలు ఇవ్వాలన్నారు. అధికారంలో ఉండి.. ప్రతిపక్షం సహాయం చేయాలని అడుగున్నారని ప్రభుత్వం పెద్దల తీరుపై హరీష్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి చేతకానితనాన్ని, వారికి అంటిన బురదను ప్రతిపక్షంపై చల్లే కుట్ర చేస్తోన్నారని ఆరోపించారు. వరదలపై రాజకీయం చేస్తు?న్న ముఖ్యమంత్రిని తొలిసారి చూస్తున్నామన్నారు. ప్రభుత్వం తరఫున ఖమ్మం వచ్చిన ఆరుగురు ప్రముఖులు ఉపన్యాసాలు చెప్పారు తప్ప.. ప్రణాళిక గురించి మాట్లాడారా? అని హరీష్ రావు ప్రశ్నించారు.

## తక్షణ సాయంగా 2వేల కోట్లు ఇవ్వండి

మహబూబాబాద్ జిల్లాలో వాటిల్లిన నష్టాలపై కలెక్టరేట్ లో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో నలుగురు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. దాదాపు 30వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని వెల్లడించారు. సహాయచర్యల్లో నిరంతరం పనిచేసిన రెవెన్యూ, పోలీసు సిబ్బందిని అభినందించారు.అధికారుల చర్యలతో ప్రాణనష్టం తగ్గించగలిగాం. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున పరిహారం ప్రకటించాం. పంట నష్టం అంచనా వేసి పరిహారం అందజేస్తాం. నష్టపోయిన మూడు తండాలవాసులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం. నష్టంపై కేంద్రానికి నివేదించడానికి నివేదిక తయారు చేయాలి. కేంద్రం దీన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలి. ఆస్తి, ప్రాణ నష్ట పరిశీలనకు ప్రధాని మోదీని ఆహ్వానించాం. తక్షణమే రాష్ట్రానికి రూ.2వేల కోట్లు కేటాయించాలని కోరారు. వర్షం తగ్గినందున బురద తొలగించే పనులు అధికారులు ప్రారంభించాలి. ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తే ఇళ్లలోని బురద తొలగించవచ్చు. విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉంది.. మరింత జాగ్రత్తగా ఉండాలి. ఎంత ఒత్తిడి ఉన్నా హైడ్రా ఏర్పాటు చేసి ఆక్రమణలను కూల్చేస్తున్నాం అన్నారు. ప్రకృతి ప్రకోపిస్తే ఏం జరుగుతుందో మనం ఇతర రాష్ట్రాల్లో చూస్తున్నాం. చెరువులు, నాలాల ఆక్రమణల తొలగింపునకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుంది. ఆక్రమణలకు సహకరించిన వారిపై కూడా చర్యలు ఉంటాయి. పేదల ప్రాణాలు పోయాక ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తూ కూర్చోదు. పువ్వాడ ఆక్రమణలు తొలగించాలని హరీశ్‌రావు డిమాండ్ చేయగలరా? ఆక్రమణల తొలగింపునకు హరీశ్‌రావు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తారా? చెరువులను ఆక్రమించిన వారు ఎంతటివారైనా తొలగించాల్సిందే. ఆక్రమణల తొలగింపునకు విధివిధానాలు రూపొందించాలని సీఎం రేవంత్ అధికారులకు దిశానిర్దేశర చేశారు. హైడ్రా తరహాలో ప్రతి జిల్లాలోనూ ఒక వ్యవస్థను కలెక్టర్లు ఏర్పాటు చేసుకోవాలని నిర్దేశించారు. చెరువులను ఆక్రమించుకోవడం క్షమించరాని నేరం అని.. చెరువుల ఆక్రమణలపైన రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపడతామని రేవంత్ రెడ్డి చెప్పారు. ఆక్రమణలకు పాల్పడినది ఎంతటి వారైనా వదిలి పెట్టబోమని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. చెరువుల ఆక్రమణకు సహకరించిన అధికారులపైన చర్యలు తీసుకోవాలని అన్నారు. చెరువులు, నాలాల ఆక్రమణల జాబితా సిద్ధం చేయాలి. మాజీ మంత్రి ఆక్రమణ వల్లనే ఖమ్మంలో వరదలు వచ్చాయనే ఫిర్యాదులు వచ్చాయి. అమెరికాలో జల్సాలో మునిగి తేలుతున్న ఆయన.. ప్రభుత్వం పైన విమర్శలు చేస్తున్నడు. వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు వెళ్లినట్లుగా హరీష్ రావు ఖమ్మం పర్యటనకు పోయిండు. ఖమ్మం మాజీ మంత్రి ఆక్రమణలపైన తొలగింపునకు హరీష్ రావు సహకరిస్తారా?అని ప్రశ్నించారు.680 మందికి పునరావాసం కల్పించాం. సీతారామ తండాలో వరద సమయంలో ప్రజలకు అండగా నిలబడ్డ ఎస్సై నగేష్ కి అభినందనలు. చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తాం. ఆకేరు వాగు వరద బారిన పడుతున్న 3 తండాలను ఒకే ప్రాంతానికి తరలించి అదర్శ కాలనీ నిర్మించాలని కలెక్టర్ కు ఆదేశించాం. పంట నష్టం జరిగిన ప్రతి ఎకరానికి రూ.10 వేల సాయం అందిస్తాం. తెలంగాణలో వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని ప్రధానికి లేఖ రాశాం. జరిగిన నష్టాన్ని పరిశీలించడానికి రాష్ట్రానికి రావాలని ప్రధాన మంత్రిని కోరుతున్నాం. దోమల నివారణ చర్యలు తీసుకోవాలి. నష్టం జరిగిన ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం ఇతర ప్రాంతాల నుంచి అధికారులను రప్పించుకోవాలి. కూలిపోయిన విద్యుత్ లైన్లను తక్షణమే పునరుద్ధరించాలి. వరద ప్రమాద ప్రాంతాలు, ప్రమాదానికి కారణాలు, వాటిని ఎదుర్కొన్న తీరుపై బ్లూబుక్ ను తయారు చేసుకోవాలి. వాటిని కలెక్టరేట్లలో ఉంచాలని అన్నారు.రదలు వచ్చినప్పుడు కేసీఆర్ పదేళ్లలో ఎప్పుడైనా పరామర్శకు వచ్చారా..? మాసాయిపేటలో పసిపిల్లలు చనిపోతే కేసీఆర్ పరామర్శించలేదు. హైదరాబాద్ శివారులో పశు వైద్యురాలిని హత్యచేస్తే వెళ్లి చూడలేదు. మానవత్వం లేని మనిషి కేసీఆర్. ప్రతిపక్ష నేత ఎక్కడున్నాడు? ఎందుకు మాట్లాడటం లేదు? స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు వరద బాధితులకు సాయం కోసం ముందుకు రావాలని రేవంత్ రెడ్డి పిలుపు ఇచ్చారు.

# అధికారుల నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

**మంత్రులైనా సహాయక చర్యల్లో పాల్గొనాల్సిందే**

**నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు**

**కఠినంగా హెచ్చరించిన చంద్రబాబు నాయుడు**



విజయవాడ,సెప్టెంబర్3(ప్రజా మంటలు):
వరద బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు అన్ని చర్యలూ చేపట్టామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. కొన్ని చోట్ల ఆహారం అందలేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విజయవాడ కలెక్టరేట్ వద్ద మీడియాతో సీఎం మాట్లాడారు. నగరంలో డివిజన్‌కు ఒక సీనియర్ ఐఏఎస్‌ను నియమించామని చెప్పారు. 32 మంది ఐఏఎస్ అధికారులు సహాయక చర్యల్లో ఉన్నారన్నారు. పది జిల్లాల నుంచి ఆహారం సమకూర్చామని.. బాధితులకు మూడు పూటలా అందించాలని ఆదేశించినట్లు చెప్పారు. చిట్టచివరి బాధితుడికి కూడా సాయం అందాలని స్పష్టం చేశారు. వరదలతో పేదల బాధలు వర్ణణాతీతం. కొన్ని ఇళ్లల్లోకి పాములు, తేళ్లు వచ్చాయి. దీంతో వారందరికీ బాధ, భయం ఉంటుంది. అధికారులంతా మానవతా దృక్పథంతో పనిచేయాలి. అందుతున్న సహాయంపై ఐవీఆర్ఎస్ నిర్వహిస్తున్నాం. కొన్ని ప్రాంతాలకు ఇంకా ఆహారం అందలేదని ఫిర్యాదులు వస్తున్నాయి. ఆహారం అందని బాధితుల నంబర్లు అధికారులకు పంపిస్తున్నాం. ఇబ్బందులపై ప్రజలు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలి. నేను కూడా ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నా. అధికారులకు రెండు రోజులుగా చెప్పాం.. ఇప్పుడు సరిగా పనిచేయలేదని ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవు. మీనమేషాలు లెక్కించడం సరికాదు.. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు సర్వశక్తులూ ఒడ్డి సేవ చేయాలి. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికీ విజ్ఞప్తి చేస్తున్నా. ఈ కష్ట సమయంలో బాధితులకు అండగా నిలవాలి. ఏవిధంగా సహకారం అందించగలిగితే అలా చేయూత అందించాలి. ఆర్థికంగా, నిత్యావసరాలు, సహాయ కార్యక్రమాల్లో పాల్గొనడం.. ఇలా ఏది వీలైతే అది మీ శక్తిమేర చేయాలి. ప్రభుత్వం తరఫున చేయాల్సిందంతా చేస్తాం. రెండు రోజు వరద ప్రభావిత ప్రాంతాల్లో చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మంత్రులు, అధికారులకు గట్టిగా హెచ్చరిక ఇచ్చారు. విపత్తు నిర్వహణలో సరిగ్గా పని చేయకుంటే, మంత్రులకైనా వేటు తప్పదని హెచ్చరిస్తున్నానని చంద్రబాబు తెలిపారు. జక్కంపూడిలో విధులు సరిగా నిర్వర్తించని ఓ
అధికారిని ఇప్పటికే సస్పెండ్ చేశానన్నారు. వీఆర్‌లో పెట్టిన అధికారులు విపత్తు నిర్వహణ బాధ్యతల్లో సక్రమంగా విధులు నిర్వర్తించ లేదనే ఫిర్యాదులు ఉన్నాయన్నారు. దీనిపైనా విచారణ జరిపిస్తున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో వివాదాస్పద అధికారులకు బాధ్యతలు అప్పగింత మంచి ఉద్దేశంతో జరిగిందా? లేక ఓవర్ లుక్‌లో అయిందా? అనేది పరిశీలిస్తున్నామని చంద్రబాబు తెలిపారు.ఏ రకంగా బాధ్యతలు అప్పగించినా పని చేయాలనే మానవత్వం సదరు అధికారులకు ఉండదా? అని ప్రశ్నించారు. టోల్ ఫ్రీ నంబర్‌లు పనిచేయట్లేదనే ఫిర్యాదును అంగీకరిస్తున్నానని చంద్రబాబు తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థ 5ఏళ్లుగా పక్షవాతం వచ్చినట్లుగా పడి ఉందని ఒకింత అసహనం వ్యక్తం చేశారు. కొత్త కంట్రోల్ రూమ్ వ్యవస్థ పెట్టి వెంటనే సమస్య పరిష్కరిస్తానన్నారు. బ్యారేజీ వద్దకు బోట్లు ఎలా కొట్టుకొచ్చాయని విచారణ జరిపిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. తప్పుడు వార్తలు ఇచ్చి ఓ వర్గం మీడియా ఇంకా పరువు పోగొట్టుకోవద్దని హెచ్చరించారు. ఉదయం నుంచి జరిగిన ఆహారం పంపిణీ వివరాలను సీఎం చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా విధుల్లో ఉన్న అధికారులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. 5 హెలీకాప్టర్ల ద్వారా ఆహార పంపిణీ జరుగుతోందని సీఎంకు అధికారులు తెలిపారు. హెలికాప్టర్, పడవలు, ట్రాక్టర్ల ద్వారా ఉదయం నుంచి ఆహారం, నీళ్లు అందిస్తున్నామని వివరించారు. 5 లక్షల ఆహారం, నీళ్ళ ప్యాకెట్లు సిద్ధం చేసి పంపిణీ చేశామని చంద్రబాబుకు అధికారులు తెలిపారు.100 శాతం ఆహారం పంపిణీ జరగాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చేరుకోలేని చోటకు హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా మూడు పూటలా ఆహారం అందించాలని తెలిపారు. 36 డివిజన్లలో విధుల్లో ఉన్న అధికారులే ఆహార పంపణీకి బాధ్యత వహించాలని చంద్రబాబు ఆదేశించారు. ఆపద సమయంలో కుట్రలు జరుగుతున్నాయి. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వారిని ఆదుకోవాలి.. చెత్త రాజకీయాలు వద్దు. ఈ పరిస్థితుల్లో గుడ్లవల్లేరు ఘటనపై ఫోకస్ చేస్తారా? ప్రకాశం బ్యారేజీలో బోట్ల ఘటనపై విచారణ చేపడతాం. ఇటీవల కొన్ని ఘటనలు అనుమానాస్పదంగా ఉన్నాయి. బాబాయ్‌నే చంపిన వారు ఉన్నప్పుడు అనుమానాలు వస్తాయి కదా! విపక్ష నేత ఐదు నిమిషాలు వచ్చి షో చేసి వెళ్లారు. ఆయన ఒక్కరికి కూడా ఆహార పొట్లం ఇవ్వలేదు.
ప్రధాని మోదీతో మాట్లాడినప్పుడు మీరున్నారు కదా.. భయం లేదని చెప్పారు. హుద్‌హుద్ సమయంలో నా పనితీరును ఆయన మెచ్చుకున్నారు. నా పట్ల ప్రజల స్పందన చూసి ప్రధాని ఆశ్చర్యపోయారు' అని చంద్రబాబు అన్నారు. విజయవాడ పర్యటనలో భాగంగా సితార సెంటర్‌కు సీఎం చంద్రబాబు చేరుకున్నారు. జేసీబీ ఎక్కి వరద కాలనీల్లో పరిస్థితి పరిశీలించారు. ఆహారం అందుతుందా..? లేదా..? అని బాధితులను అడిగి తెలుసుకుంటున్నారు. స్వయంగా ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకుంటున్నారు. ప్రజల నుంచి వచ్చే స్పందన ఆధారంగా అధికారులపై చర్యలు ఉంటాయని చంద్రబాబు తెలిపారు.




# వరదబాధితులను ముంపు నుంచి తరలించాం

**8.5లక్షల మందికి టిఫిన్ ప్యాకెట్లు, అన్నం ప్యాకెట్లు పంపిణీ**

**పారిశుద్ధ్యం సాధారణ స్థితికి తీసుకురావడానికి 10వేలమంది అవసరం**

**మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ వెల్లడి**



అమరావతి,సెప్టెంబర్3 (ప్రజా మంటలు):
వరద ముంపు ప్రాంతాల్లో ఎంతో కష్టపడి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించామని పురపాలకశాఖ మంత్రి నారాయణ తెలిపారు. బాధితులందరికీ ఆహారం అందేలా ఏర్పాట్లు చేశామన్నారు. వరద సహాయక చర్యలపై ఆయన మీడియాతో మాట్లాడారు. మంగళవారం 8.5లక్షల టిఫిన్ ప్యాకెట్లు, 8.5లక్షల అన్నం ప్యాకెట్లు పంపిణీ చేశాం. 5 లక్షల వాటర్ బాటిల్స్ బాధితులకు అందించాం. వరద నీరు తగ్గిన తర్వాత రోడ్లపై మురుగు లేకుండా పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి పెట్టాం. ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం సాధారణ స్థితికి తీసుకురావడానికి 10వేల మంది కార్మికులు అవసరమవుతారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 123 మున్సిపాలిటీల కమిషనర్లకు వరద ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాం. ఒక్కో సచివాలయానికి ఒక్కో ప్రత్యేకాధికారి ఉంటారు. వరద నీరు తగ్గగానే అగ్నిమాపకశాఖతో కలిసి ట్యాంకర్ల ద్వారా రోడ్లను శుభ్రం చేస్తాం. బ్లీచింగ్, ఫాగింగ్ పనులు చేపడతాం, వైద్యారోగ్య శాఖతో కలిసి మెడికల్ క్యాంపులు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. విజయవాడను మూడు మార్గాల్లో వరద నీరు చుట్టుముట్టిందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. కృష్ణానదితో పాటు బుడమేరు, మున్నేరు నుంచి ఒకేసారి వరద రావడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తాయని చెప్పారు. జనజీవనం సాధారణ స్థితికి వచ్చే వరకు ప్రభుత్వం విశ్రమించదన్నారు. ఎక్కడా విద్యుత్ కొరత లేదని, వరద ఉన్న చోట్ల విద్యుత్ పునరుద్ధరిస్తే ప్రాణాపాయమనే.. ముందుజాగ్రత్త చర్యగా విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి వచ్చిందని తెలిపారు. విజయవాడ వరద ముంపు ప్రాంతంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మంగళవారం పర్యటించారు. 61, 62, 63, 64వ డివిజన్లలో సహాయక చర్యలను పర్యవేక్షించారు. స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ బాధితులకు ఆహారం తీసుకెళ్లి మంత్రి పంపిణీ చేశారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో ప్రజలను ముంపు ప్రాంతం నుంచి బయటకు తీసుకు వచ్చేలా మంత్రి చర్యలు చేపట్టారు. స్థానిక అధికారులు, సహాయక బృందాలను సమన్వయం చేస్తూ ప్రజలకు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ప్రజలకు సహాయక చర్యలు అందించడంలో అధికారులు జాప్యం చేస్తే కఠిన చర్యలుంటాయని మంత్రి జనార్ధన్ రెడ్డి హెచ్చరించారు.

# వరదలతో పంటపొలాల మునక

**ఐదు లక్షల ఎకరాల్లో పంట నష్టం**

**మూడున్నర లక్షల ఎకరాల్లో దెబ్బతిన్న వరి పంట**

**ఇరవైకిపైగా జిల్లాలపై వర్షాల ప్రభావం**

విజయవాడ,సెప్టెంబర్3 (ప్రజా మంటలు):
ఏపీలో వర్షాలకు దాదాపుగా ఐదు లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు అధికారులు ప్రాథమికంగా తేల్చారు. క్షేత్రస్థాయి పర్యటన తర్వాత దీనిపై ప్రభుత్వానికి పూర్తి స్థాయి నివేదిక ఇస్తారు. రాష్ట్రంలోని ఇరవైకిపైగా జిల్లాలపై వర్షాల ప్రభావం ఉందని వీటిలో ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో భారీ నష్టం జరిగినట్టు గుర్తించారు. తర్వాత పశ్చిమగోదావరి జిల్లాపై ప్రభావం ఎక్కువగా ఉందంటున్నారు. భారీ వర్షాలు, వరదలు ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. విజయవాడ లోని కొన్ని ప్రాంతాలు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. మూడు రోజులు అవుతున్నా ఇంకా ముంపు వీడటం లేదు. ప్రభుత్వం వారికి కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. ప్రస్తుతానికి పునరావాసం, బాధితులకు నిత్యవసరాలు అందివ్వడంలో బిజీగా ఉన్న ఏపీ ప్రభుత్వం ప్రాథమిక అంచనాలపై కూడా దృష్టి పెట్టింది. ఈ వర్షాలకు సుమారు మూడున్నర లక్షల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్టు లెక్కలు కట్టారు. ఇందులో గుంటూరు, కృష్ణా జిల్లాల పరిధిలోనే ఎక్కువగా నష్టం వాటిల్లింది. ఈ జిల్లాల్లోల దాదాపు మూడు లక్షల ఎకరాల్లో పైరు నీటిలో ఉన్నట్టు అధికారులు గుర్తించారు. తర్వాత గోదావరి జిల్లాల్లో దాదాపు 30 వేలకుపైగా ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్టు చెబుతున్నారు. వర్షాల వల్ల ఎకరాకు 15వేల వరకు నష్టం వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇలా పంటలు దెబ్బతిన్న వారిలో వరిరైతులతోపాటు పత్తి, మొక్కజొన్న, మినుము, పెసర రైతులు కూడా ఉన్నారు. వేల ఎకరాల్లో పత్తి నీట మునిగిందని చెబుతు న్నారు. వర్షాల వల్ల పంట దెబ్బతినడమే కాకుండా చీడపీడలు కూడా చుట్టుముడతాయని అంటున్నారు. వరదల కారణంగా ఏపీలో 19 మంది మృతి చెందినట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇంకా ఇద్దరి ఆచూకీ తెలియడం లేదని పేర్కొంది. దాదాపు రెండు వేల కిలోమీటర్ల వరకు రహదారులు దెబ్బతిన్నట్టు అంచనా వేస్తోంది. ఇప్పటికే నీట మునిగిన ప్రజలు 176 పునరావాస కేంద్రాల్లో ఉంటున్నట్టు పేర్కొంది. వీళ్ల కోసం ప్రత్యేకంగా 171 వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపింది. సహాయక చర్యల్లో 36 ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు నిరంతరం పని చేస్తున్నాయని వివరించింది. బాధితుల కోసం 3 లక్షల ఫుడ్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ రెడీగా ఉన్నట్టు ప్రకటించింది. వీటిని అందించేందుకు బోట్లు, డ్రోన్లు, హెలికాప్టర్ల సహాయం తీసుకున్నట్టు తెలిపింది ప్రభుత్వం. ఇలా భారీగా వచ్చిన వరదల కారణంగా రహదారులు, ఇళ్లు, పంటలు, ఇతర మౌలిక వసతులుపూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రస్తుతానికి ఇంకా ప్రజలు ముంపు ప్రాంతాల్లో ఉన్నందున వారికి చేయాల్సిన సాయంపైనే ఎక్కువ ఫోకస్ పెడుతోంది. ఓవైపు బాధితులకు సాయం చేస్తూనే...మరోవైపు విద్యుత్ పునరుద్ధరణ పనులు, రహదారుల పునర్‌నిర్మాణం చేస్తోంది.



# వరదబాధితులకు ఆహారం, నీరు

**నిరంతరంగా శ్రమిస్తున్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు**

**సహాయక చర్యలపై చంద్రబాబు పర్యవేక్షణ**

విజయవాడ,సెప్టెంబర్3 (ప్రజా మంటలు):
విజయవాడను పెద్ద ఎత్తున వరద ముంచెత్తడంతో.. ఏకంగా సీఎం చంద్రబాబు సహా మంత్రులు, అధికారులు అంతా విజయవాడలోనే తిష్ట వేసి మరీ వరద సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. బాధితులకు ఎప్పటికప్పుడు ధైర్యం చెబుతున్నారు. బాధితులకు మూడు పూటలా భోజనంతో పాటు వాటర్ సదుపాయం కల్పిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దింపి మరీ సహాయక చర్యలు బాధితులకు అందేలా చూస్తున్నారు. విపత్తు సమయంలో సరిగా పని చేయకుంటే ఎవ్వరినీ వదలబోనని సీఎం చంద్రబాబు తెలిపారు. మరోవైపు మంత్రి నారా లోకేష్ పర్యవేక్షణలో విజయవాడ వరద బాధితులకు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మంగళవారం సహాయక చర్యల్లో ఆరు హెలికాప్టర్లు ద్వారా ఆహారం, తాగు నీటిని సరఫరా చేశారు. బోట్లు చేరుకోలేని ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా ఆహార సరఫరా చేస్తున్నారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ విజ్ఞప్తి మేరకు జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీకి ప్రత్యేక హెలికాప్టర్‌లో 2,500 ఆహార పొట్లాలను చేరవేస్తున్నారు. విజయవాడ పరిధిలో వరద ముంపునకు గురైన 32 వార్డుల్లో సీనియర్ ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మంత్రి లోకేష్ పిలుపు మేరకు సహాయ చర్యల్లో రాష్ట్రం నలుమూలల నుంచి విజయవాడకు పార్టీ శ్రేణులు చేరుకున్నాయి. విజయవాడ డివిజన్ పరిధిలో 70 పునరావాస కేంద్రాల్లో 14,452 మంది నిరాశ్రయులు ఆశ్రయం పొందుతున్నారు. ప్రకాశం బ్యారేజి వద్ద వేగంగా వరద తగ్గుముఖం పడుతోంది. ప్రస్తుత వరద ప్రవాహం 8,71,776 క్యూసెక్కులకు చేరుకుంది. మరోవైపు రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరద పరిస్థితులు, బాధితులకు అందుతున్న ఆహారం గురించి ఆరా తీశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తు న్నారు. తాగునీరు, ఆహారం ప్రతి ఒక్కరికి చేరాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న సహాయక చర్యల్లో కార్యకర్తలు పాల్గొనాలని సూచించారు. ఇప్పటికే మచిలీపట్నం నుంచి విజయవాడకు టీడీపీ కార్యకర్తలు చేరుకున్నారు. బాధితులకు అండగా నిలవాలని, భరోసా కల్పించాలని కార్యకర్తలందరికీ కొల్లు రవీంద్ర సూచించారు.



# బుడమేరు పాపం వైకాపాదే

**ఇసుక తవ్వకాలతోనే వరద ముంపు**

**టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విమర్శలు**

**బుడమేరు శాంతించడంతో మరమ్మత్తులకు దిగిన అధికారులు**

అమరావతి,సెప్టెంబర్3 (ప్రజా మంటలు):
వైసీపీ నేతల అక్రమ ఇసుక దందా వలనే బుడమేరుకు గండ్లు పడి కోతకు గురైందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు యాదవ్ విమర్శలు గుప్పించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గత ఐదేళ్లు బుడమేరును గాలికొదిలేసిన జగన్.. నేడు ప్రభుత్వంపై బురద చల్లేందుకు వచ్చాడని మండిపడ్డారు. విపత్తుల సమయంలో జగన్ ఏనాడు బాధితుల పక్షాన నిలబడలేదన్నారు. ఐదేళ్ల పదవీకాలంలో సాయంత్రం 5 తరువాత ఒక్క రోజు కూడా జగన్ బయటకు రాలేదన్నారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ప్రజాహితం కోరాలని తెలిపారు. జగన్ రెడ్డి ఫేక్ ప్రచారం మానుకోవాలని... విమర్శలు నిర్మాణాత్మకంగా ఉండాలన్నారు. చంద్రబాబు ఇంటి కోసం బుడమేరు నీరు డైవర్ట్ చేశారని చెప్పడం జగన్ తెలివితక్కువతనానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద బాధితుల కోసం నిలబడిన భగీరదుడు చంద్రబాబు అని అన్నారు. బాధితుల కోసం యంత్రాంగాన్ని, నేతలను, హెలికాప్టర్లు, బోట్లు, డ్రోన్లతో యుద్ధప్రాతిపదికన సాహాయ సహకారాలను అందించడం చంద్రబాబు వలనే సాధ్యమైందన్నారు. అమరావతిపై తప్పుడు ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణం చేయడంలో చంద్రబాబు పాత్ర కీలకం కానుందని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మరోవైపు... 48 గంటలుగా మహోగ్రరూపం దాల్చిన బుడమేరు కాస్త శాంతించింది. దీంతో బుడమేరులో గండి పడిన ప్రాంతాన్ని పూడ్చేందుకు ఇరిగేషన్ అధికారులు సిద్ధమయ్యారు. మొత్తం మూడు చోట్ల గండ్లు పడినట్లు అధికారులు గుర్తించారు. దీంతో యుద్ధ ప్రతిపాదికన పనులను చేపట్టారు. రానున్న మూడు రోజుల పాటు పనులు కొనసాగే అవకాశం ఉంది. బుడమేరుకు వరద ప్రవాహం తగ్గిపోవడంతో ఇరిగేషన్ అధికారులు పనులు ప్రారంభించారు. 48 గంటలుగా మహోగ్రరూపం దాల్చిన బుడమేరు కాస్త శాంతించింది. రానున్న మూడు రోజుల పాటు పనులు కొనసాగే అవకాశం ఉంది. బుడమేరుకు వరద ప్రవాహం తగ్గిపోవడంతో ఇరిగేషన్ అధికారులు పనులు ప్రారంభించారు. కాగా.. భారీ వర్షాల కారణంగా బుడమేరు డిజైన్ కెపాసిటీ 15 వేల క్యూసెక్కులకు మించి వరద నీరు వచ్చి చేరింది. బుడమేరుకు భారీగా వరద వచ్చి చేరడంతో విజయవాడలోని 16 డివిజన్లు ముంపునకు గురయ్యాయి. దాదాపు రెండు రోజులుగా సుమారు 2 .59 లక్షల మంది ప్రజానీకం జలదిగ్బంధంలో ఉండిపోయారు. బుడమేరులో ప్రస్తుతం 6 వేల క్యూసెక్కులు మాత్రమే వరద ప్రవాహం ఉంది. ఇది మరింత తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. బుడమేరు కాస్త శాంతించడంతో గ్రామస్తులంతా ఊపిరి పీల్చుకున్నారు. బుడమేరు వరద ధాటికి వందల ఎకరాల్లో పత్తి, వరి పొలాలు నీట మునిగాయి. బుడమేరుతో పాటు వరద ప్రభావిత ప్రాంతాల్లోని పరిస్థితిపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. మరోవైపు వరద ముంపు ప్రాంతాల్లో ఆహారం సరఫరాకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

# శృంగారం రెండు మనసుల సంగమం

## ఆకలి, దాహం ఎలాంటివో సెక్స్ కూడా అలాంటిదే



ప్రపంచ లైంగిక ఆరోగ్య దినోత్సవం బహిరంగ సంభాషణ, సమగ్ర లైంగిక విద్య, అవగాహన ప్రచారాలు మరియు అందుబాటులో ఉండే ఆరోగ్య సంరక్షణ సేవల అవసరాన్ని సూచిస్తుంది. పిల్లలు లైంగిక ఆరోగ్యం గురించి బహిరంగంగా చర్చించగలిగే వాతావరణాన్ని సృష్టించడంలో కుటుంబాల పాత్రను కూడా ఇది నొక్కి చెబుతుంది. లైంగిక శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా, భారతదేశం నిజంగా సమకాలీన మరియు ప్రగతిశీల సమాజంగా పురోగమిస్తుంది.

### నిశ్శబ్దాన్ని విచ్ఛిన్నం చేయడం: లైంగిక ఆరోగ్య అవగాహనను మార్చే సమయం

ప్రస్తుత కాలంలో భార్య, భర్తల మధ్య స్పర్శ, మాటా ముచ్చటకు, శృంగారమునకు నోచుకోని కుటుంబాల సంఖ్య నానాటికి పెరిగిపోతున్నాయి. ఆ మధురానుభూతిని, ప్రేమానురాగాలను, అప్యాయతను పొందలేక మానసిక సమస్యలతో జీవితాన్ని పాడు చేసుకొంటున్నారు. వరల్డ్ అసోసియేషన్ ఫర్ సెక్సువల్ హెల్త్ లైంగిక ఆరోగ్యం పై సామాజిక అవగాహన కలిగించడానికి ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబర్ 4 నాడు వరల్డ్ సెక్సువల్ హెల్త్ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈ సంవత్సరం లైంగిక కార్యకలాపాలలో భాగస్వాములు లైంగిక ఆనందం పొందడం కోసం తప్పనిసరిగా సానుకూల సంబంధాలను ఏర్పరుచుకోవడం అనే ఉద్దేశ్యంతో పలు కార్యక్రమాలను ప్రపంచవ్యాప్తంగా నిర్వహించాలని పిలుపునిచ్చింది. సానుకూల సంబంధాలు అనేవి లైంగిక ఆరోగ్యానికి మూలస్తంభంగా ఆరోగ్యకరమైన మరియు సంతృప్తికరమైన సంబంధాలను పెంపొందించడం యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేస్తుంది.

### సెక్స్-ఎడ్యుకేషన్ లేకపోవడం

భారతదేశంలో సెక్స్ నిషిద్ధం. సెక్స్-ఎడ్యుకేషన్ లేకపోవడం వల్ల, చాలా మందికి ఆరోగ్యకరమైన మరియు సరైన లైంగిక అభ్యాసాల గురించి తగినంత జ్ఞానం లేదు. పెద్ద సంఖ్యలో స్త్రీలు బాల్య వివాహాలు లేదా తక్కువ వయస్సు గల వివాహాలకు (18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారు) బాధితులవుతున్నారు. పరిపక్వత లేకపోవడం మరియు లైంగిక అభ్యాసాలు మరియు గర్భనిరోధకం గురించిన జ్ఞానం తలెత్తే సమస్యలకు తోడ్పడుతుంది. సమ్మతి అనేది అనుమతి. అనుమతి లేకుండా మరొకరి శరీరాన్ని తాకకూడదు.

### భాగస్వామిలో సానుకూలత

భార్యభర్తలకి ఎలాంటిదయిన సమస్య వచ్చిన, గోడవపెట్టుకున్నప్పటికి సమస్య ఎలాంటిదయినా సరే మనసు విప్పి మాట్లాడుకోవాలి.అప్పుడే సమస్యలు సద్దుమణుగుతాయి. మనసువిప్పి మాట్లాడుకోవడం వల్ల దాంపత్య జీవితం సంతోషంగా ఉంటుంది. ఆలుమగల మధ్య ఇద్దరిలో ఏవో లోపాలు ఉంటాయి. దంపతులలో ఒకరిలో లోపాల్ని మరొకరు ఎత్తి చూపుతుంటారు.ఎదుటి వారి స్థానంలో ఉండి మనం ఆలోచించగలిగితే ఆ సమస్యలకు చెక్ పేట్టోచ్చు . భాగస్వామిలోని సానుకూలతల్ని గుర్తిస్తే ఆలుమగలు సంతోషంగా జీవించవచ్చు.

### అసంపూర్తి సెక్సు పరిజ్ఞానం

సెక్సు పట్ల పూర్తి అవగాహన లేకపోవడం వల్ల కొత్తగా పెళ్లి చేసుకున్న దంపతులలో అనవసర భయాలు చోటు చేసుకుంటున్నాయి. వీరికి సెక్సు పట్ల అవగాహన కల్పించేవారు కూడ కరువయ్యారు. స్నేహితులు, పుస్తక పఠనం ద్వారా అసంపూర్తిగా తెలుసుకున్న సెక్సు పరిజ్ఞానం తో అనవసరభయాలతో డిప్రెషన్ లోకి వెల్లుతున్నారు. ఎన్ని డిగ్రీలు పూర్తి చేసిన లైంగిక విద్యపై అవగాహన ఉండక పోవచ్చు. వివాహానికి ముందుగానే కౌన్సెలింగ్ తీసుకోవడం ద్వారా వివాహం చేసుకున్న తర్వాత దాంపత్య జీవితం సుఖమయంగా ఉంటుంది. ప్రీ మారిటల్ కౌన్సెలింగ్ ద్వారా సెక్స్ , కొత్తగా పెనవేసుకున్న బంధాలను మరింత బలపడటానికి దంపతులు ఎలాగో ఉండాలో తెలుస్తుంది.

### లైంగిక శ్రేయస్సుపై మానసిక ఆరోగ్యం యొక్క ప్రభావం

మానసిక ఆరోగ్య సవాళ్లు ఒకరి లైంగిక శ్రేయస్సుపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయి, దీని ఫలితంగా తరచుగా లిబిడో తగ్గిపోతుంది, పనితీరు ఆందోళనలు మరియు సన్నిహిత బంధాలను ఏర్పరచడంలో మరియు కొనసాగించడంలో సవాళ్లు ఏర్పడతాయి. ఆధునిక జీవన విధానంతో మనుషులలో ఒత్తిడి పెరుగుతోంది. భార్యా భర్తల మధ్య ఒక వైపు ఉద్యోగ జీవితం, మరో వైపు కుటుంబ బాగోగులను బాలన్సు చేసుకోవడానికి మనిషి తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నాడు. భార్య, భర్తల ఇరువురి మధ్య




శృంగారంతొ , సెక్సు తో మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చు. ఆనందమయ జీవితానికి బాటలు వేసుకోవచ్చు. భార్యాభర్తల మధ్య రహస్యాలు ఉండకూడదు.

లైంగిక విద్య పై అవగాహన భారత చట్టం యొక్క పరిమితులకు లోబడి, పరిధికిలోబడి మాత్రమే ఉండాలి. గుడ్ టచ్ బాడ్ టచ్ లపై అవగాహన కలిగించే వారు ప్రస్తుత కుటుంబ వ్యవస్థలో కరువయ్యారు. అందుకే చిన్న పిల్లలు, ఆడ పిల్లలు సులభంగా మృగాల చేతిలో బడి మోసపోతున్నారు, అత్యచారాలకు గురవుతున్నారు.

### సెక్స్-పాజిటివ్ లైంగిక హక్కులు

లైంగిక హక్కులు అనేవి ప్రాథమిక మానవ హక్కులు, మరియు ఇవి ప్రజల శ్రేయస్సు మరియు సంతృప్తికరమైన జీవితాన్ని గడపడానికి అవసరం. ఇవి లైంగికతపై సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తుంది, ఇది ప్రతి ఒక్కరి లైంగిక గుర్తింపును గౌరవించేది, లైంగికత అనేది ఒక వ్యక్తి జీవిత గుర్తింపులో అంతర్భాగం. అయినప్పటికీ, లైంగికత మరియు లైంగిక ఆరోగ్యం మాట్లాడుట అనేది నిషిద్ధ విషయాలుగా పరిగణించబడుతున్నాయి. నేటి నుండే ప్రారంభించండి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంరక్షకులు మరియు శిశు వైద్యులను వారి సంరక్షణలో పిల్లలు మరియు యువతకు వయస్సుకు తగిన మరియు శాస్త్రీయంగా ఖచ్చితమైన లైంగిక విద్యను అందించాలి. సమగ్ర లైంగికత విద్య యువకులకు నుండి మొదలుకొని పెద్దల వరకు మరింత సెక్స్-పాజిటివ్‌గా ఉండటానికి దోహదం చేస్తుంది.

డా. అట్ల శ్రీనివాస్ రెడ్డి ,
సెక్స్ ఎడ్యుకేటర్ రిహాబిలిటేషన్ సైకాలజిస్ట్
ఫ్యామిలీ కౌన్సెలర్ 9703935321

# బాధితులను ఆదుకునేందుకు ముందుకు రండి: సిఎం

అమరావతి,సెప్టెంబర్3 (ప్రజామంటలు):

వరద బాధితులను ఆదుకునేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఏపీ ప్రభుత్వం పిలుపునిచ్చింది. బాధితులకు ఏ రూపంలోనైనా సాయం అందించాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు కోరారు. స్వచ్ఛందంగా ఆహారం ఇవ్వదలచిన దాతల కొసం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏపీ ప్రభుత్వం ప్రత్యేక పాయింట్ ఏర్పాటు చేసింది. ఆహారం అందించే దాతలను కో-ఆర్డినేట్ చేసుకునే బాధ్యతను ఐఏఎస్ మనజీర్‌కు అప్పగించింది. స్వచ్ఛందంగా ముందుకు వచ్చే దాతలకు మరింత సమాచారం అందించేందుకు 79067 96105 నెంబర్‌లో సంప్రదించాలని కోరింది.

# కొనసాగిన హైడ్రా కూల్చివేతలు

### స్కూల్ ఆక్రమించిన కట్టడాలు నేలమట్టం

సంగారెడ్డి,సెప్టెంబర్3(ప్రజామంటలు):

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ఐలాపూర్ తండా, అమీన్‌పూర్‌లో ఆక్రమణలను కూల్చివేసింది. ఐలాపూర్ తండాలో ఆక్రమించిన సుమారు 20 ఎకరాల భూమిని రక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. సర్వే నంబర్ 119లో గుర్తుతెలియని వ్యక్తులు ప్లాట్లు వేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో హైడ్రా, రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి కట్టడాలు, సరిహద్దు రాళ్లను తొలగించారు. అనంతరం ఫ్యూజన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో ఆక్రమణలు కూల్చివేశారు. 15 గుంటల భూమి ఆక్రమించి గదులు, ప్రహరీ నిర్మాణం చేపట్టినట్లు హైడ్రా గుర్తించింది. హైడ్రా ఆదేశాలతో రెవెన్యూ అధికారుల కూల్చివేతలు చేపట్టారు.



# వరద పరిస్థితులపై మాజీ సిఎం జగన్ సమీక్ష

### పార్టీ పరంగా కోటి విరాళం ప్రకటన

అమరావతి,సెప్టెంబర్ 3 (ప్రజామంటలు):



కృష్ణా నదికి భారీ వరదలతో విజయవాడలో తలెత్తిన పరిస్థితిపై మాజీ సీఎం, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ నాయకులతో సమీక్షించారు. వరద బాధితుల కోసం పార్టీ తరఫున కోటి రూపాయల సాయం ప్రకటిస్తున్నట్లు వైసీపీ అధినేత జగన్ వెల్లడించారు. అది ఏ రూపంలో, ఎలా ఇవ్వాలనేది పార్టీ నాయకులతో చర్చించి, నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వరద ముంచెత్తిన ప్రాంతాల్లో ప్రభుత్వం ఎలాంటి సహాయ కార్యక్రమాలు చేపట్టడం లేదని, లక్షలాది మంది కనీసం ఆహారం, మంచినీరు కూడా దొరక్క నానా ఇబ్బంది పడుతున్నారని సమావేశంలో పలువురు నాయకులు జగన్ కు తెలిపారు. వరద ప్రాంతాల్లో షో చేస్తూ, ఫోటోలకు ఫోజులు ఇస్తూ, సీఎం చంద్రబాబు పర్యటిస్తున్నారని, అధికార యంత్రాంగమంతా ఆయనతో ఉంటూ, ప్రజల సమస్యలను గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. దీంతో వరద బాధితులు అనారోగ్యం పాలవుతున్నా, వారికి మందులు కూడా లభించడం లేదని, చివరకు పాలు కూడా దొరక్క తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. వరద బాధితుల పడుతున్న కష్టాలను స్వయంగా చూశానన్న వైయస్ జగన్... వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఘోర తప్పిదం వల్లనే ఈ ఘటన చోటు చేసుకుందని, అయినా నింద తమపై మోపే ప్రయత్నం చేస్తున్నారని ఆయన చెప్పారు.

## వ్యాసకర్తలకు వినతి

**రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై వ్యాసాలు పంపేవారు మీ వ్యాసాలను వీలైనత క్లుప్తంగా, వివరణాత్మకంగా, 350-400 ల పదాలకు పరిమితం అయి ఉండేలా చూడండి. పెద్ద వ్యాసాలను పరిశీలించనడం సాధ్యం కాకపోవచ్చని గ్రహించగలరు. వర్డ్ డాక్యుమెంట్, లేదా ఓపెన్ ఫైల్ లో, ఈ మెయిల్ కు మాత్రమే పంపగలరు.**

mantalukathalu@gmail.com

-ఎడిటర్

# సాటిలేని మేటి జ్యోతిశ్శాస్త్ర ఘనాపాటి భమిడిపాటి

### 6 వేల సంవత్సరాల క్యాలెండర్ రూపకర్త...150 చిత్రాల కథా రచయిత - సెప్టెంబర్ 4... భమిడిపాటి రాధాకృష్ణ వర్ధంతి



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

కాలచక్రంతో పాటు గ్రహగతులనూ, జ్యోతిశ్శాస్త్రాన్నీ కూలంకషంగా అధ్యయనం చేసి అక్షరాలకూ, సంఖ్యలకూ బ్రహ్మముడులు వేస్తూ ఒక వ్యక్తి పేరులోంచి వారు పుట్టిన సమయాన్ని వెలికి తీసేందుకు తెలుగు భాషలోని అసంఖ్యాక గుణింతాలతో కూడిన ఒక నిర్దిష్ట సూత్రం రూపొందించి దాని ఆధారంగా జాతకాలను అధ్యయనం చేస్తూ జ్యోతి శ్శాస్త్రంలో ఓ వినూత్న ధోరణిని ప్రవేశపెట్టి ఆ శాస్త్రం విలువను ప్రపంచానికి అందిస్తూ ఎందరికో భవిష్యన్మార్గదర్శకం చేసింది ఒక ఆంధ్రుడేనే విషయం చాలా మందికి తెలియదు.


అప్పటి వరకూ అనుసరిస్తున్న గణన పద్ధతిలో ఖచ్చితత్వం సరిగా లేక, లోప భూయిష్టమై,

తప్పుల తడకలతో నడకలు సాగిస్తున్న ప్రపంచ కాలచక్ర గతులు సరిచేసే నిమిత్తం 45 బి.సి నుంచి 5,555 ఎ.డి వరకూ ఆంగ్ల క్యాలెండర్‌ను సరిదిద్ది సరికొత్త భమిడిపాటి కేలెండర్‌ను రూపొందించిన మేటి విజ్ఞానవేత్త మన తెలుగుబిడ్డ కావడం అది నిజంగా గర్వకారణ అంశం కాక మరేమిటి? సూర్యుని చుట్టూ భూమి చేసే భ్రమణానికి పట్టే సమయం 365.25 రోజులంటూ ప్రపంచం అప్పటి వరకూ నమ్ముతున్న సూత్రాలను తిరగరాసి, ఈ భ్రమణానికి 365.2422 రోజులు పడుతుందంటూ గణిత సూత్రాల ఆధారంగా ఖచ్చితంగా నిరూపించి నిర్ధారించిన మహా శాస్త్రవేత్త, సాటిలేని జ్యోతిశ్శాస్త్ర మేటి ఘనా పాటి భమిడిపాటి రాధాకృష్ణ. భాషా వ్యాకరణ, ఖగోళ, గణితశాస్త్ర సూత్రాలతో అనుసంధానమై నిర్దిష్ట ఫలితాలను నిక్కచ్చిగా అందించే విజ్ఞాన గని అని నిరూపించి, తన వాస్తవిక దృక్పథాన్ని నిరూపించు కున్న వ్యక్తిత్వం ఆయన సొంతం. రాధాకృష్ణ వ్యాకరణ, ఖగోళ, గణిత శాస్త్రాలను అనుసంధానించి అధ్యయనం చేయడం ద్వారా జ్యోతిశ్శాస్త్ర మూలాలను మర్ధించి అసామాన్య జ్యోతిశ్శాస్త్రవేత్తగా ప్రశంసా పాత్రులైనారు. జ్యోతిశ్శాస్త్రంలో పూర్వం నుంచీ ఉన్న ఆ శాస్త్ర గ్రంథాలైన సారావళి, బృహజ్జాతకం, పరాశర గ్రంథం, జాతక మార్తాండ, జాతక సర్వస్వం, జాతక చంద్రిక, కేరళీయం ఇత్యాది గ్రంథాల్లో నిర్దిష్ట అంశంపై పరస్పర విరుద్ధమైన ఫలితాలు పేర్కొనబడడం రాధాకృష్ణ గమనించారు. అనంతరం వాస్తవిక దక్పథంతో ఈ శాస్త్ర గ్రంథాల నిగ్గు తేల్చేందుకు 40 ఏళ్ల పైబడిన వారికి చెందిన 2,600 జాతకాలు, 72 మంది కవలల జాతకాలు సేకరించి పరిశోధించారు. ప్రస్తుతం వాడుకలో ఉన్న ఇంగ్లీషు కాలెండర్‌లో తప్పు ఉందని రుజువు చేసి, దానిని సరి చేసుకొనే విధానాన్ని సూచిస్తూ 1990లో “ది భమిడిపాటి కేలెండర్”ను ఆంగ్లంలో పుస్తక రూపంలో ప్రచురించారు. జపాన్, లండన్ లాంటి విదేశాల్లో ఈ క్యాలెండర్ విడుదలై, విక్రయించ బడి సంచలనం సష్టించింది. ప్రపంచంలో ఇటువంటి ప్రయత్నం ఇదే తొలిసారి కాగా అయన అపూర్వ కృషి... విజ్ఞులు, విమర్శకుల మన్ననలందుకుంది. ఇది ఆంధ్రులందరికీ గర్వకారణం.

తన మరణాన్ని సూచించేలా అన్యాపదేశంగా సెప్టెంబర్ 4వ తేదీన ఈ లోకాన్ని వదులుతానని ముందుగానే తన డైరీలో రాసుకున్న రాధాకృష్ణ రాతలు ఆయన నుదుటి మీద గీతలేనన్న వాస్తవాన్ని ఎవరూ ఊహించ లేకపోవడం గమనార్హం.

భమిడిపాటి రాధాకృష్ణ 24-11-1929 వ తేదీన రాజమండ్రిలో జన్మించారు. అక్కడే శ్రీ వీరేశలింగం ఉన్నత పాఠశాల లోను, తరువాత రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలోను విద్యాభ్యాస్యం చేసి, 1949లో బీ.ఎస్సీ పట్టభద్రు లయ్యారు. తండ్రి శ్రీ కామేశ్వరరావు ఖ్యాతిగాంచిన హాస్య రచయిత కాగా... ఆయన రచనాభినివేశాన్ని తన జీన్స్‌లోనూ జీర్ణించుకున్నారు రాధాకృష్ణ.

భమిడిపాటి రాధాకృష్ణ (నవంబరు 24, 1929 - సెప్టెంబరు 4, 2007) లబ్ధ ప్రతిష్టులైన నాటక, సినీ కథా రచయిత, జ్యోతిష శాస్త్ర పండితుడు, సంఖ్యాశాస్త్ర నిపుణుడు. అయన హాస్య రచయిత. “హాస్య బ్రహ్మ” భమిడిపాటి కామేశ్వరరావు కుమారుడు. రాధాకృష్ణ బహుముఖ ప్రజ్ఞశాలి. ఆయన మొదటి రచన భజంత్రీలు నాటిక. దీన్ని మొదటిసారిగా 25-2-1950 వ తేదీన రాజమండ్రిలో ఆర్ట్స్ కాలేజి పూర్వ విద్యార్థి వార్షికోత్సవ సందర్భంలో ప్రదర్శించారు. అయన 3 నాటకాలు, 6 నాటికలు రచించగా ప్రతీ ఒక్కటీ వెయ్యి ప్రదర్శనలకి పైగా ప్రదర్శింపబడి నాటకరంగ ఖ్యాతిని ఇనుమడింప చేశాయి. అవి కన్నడ, తమిళ, హిందీ భాషల్లోకి అనువాదం అయినాయి. “ఇదేమిటి, కీర్తిశేషులు, మన స్తత్వాలు, భజంత్రీలు, దంత వేదాంతం” వంటి నాటికలు, నాటకాలు వ్రాశారు. రావుగోపాల రావు ‘కీర్తిశేషులు’ లోని ఒక పాత్ర ధరించడం ద్వారా గుర్తింపు తెచ్చుకుని సినీ పరిశ్రమలోనూ అడుగు పెట్టాడు.28-1-1952న రాజమండ్రిలో జరిగిన సన్మాన సభలో, ఆ సభకి అధ్యక్షత వహించిన శ్రీ అక్కినేని నాగేశ్వర రావు ఆధ్వర్యాన, రాధాకృష్ణకు “దృశ్య కావ్య ధురీణ” అనే గౌరవ పురస్కారం జరిపారు. నిర్మాత దుక్కిపాటి మధుసూదన రావు ప్రోద్బలంతో సినీ రంగంలోకి ప్రవేశించి 150 సినిమాలకు కథలందించారు. ఇందులో కె.విశ్వనాథ్ తొలి చిత్రమైన



Radhakrishna Bhamidipati

“ఆత్మగౌరవం” కూడా ఉంది. బ్రహ్మచారి, కథానాయకుడు, కీర్తిశేషులు, మరపురాని కథ, విచిత్ర కుటుంబం, పల్లెటూరి బావ, ఎదురులేని మనిషి, గోవుల గోపన్న, సీతారామ కళ్యాణం, నారీనారీ నడుమ మురారి, కాలేజీ బుల్లోడు వంటి వాటితో సహా తెలుగు పలు చిత్రాలకు కథలు వ్రాశారు. ఎన్టీఆర్, ఏఎన్నార్ లకు ఆయన సన్నిహితులు. 1994 తర్వాత క్రమంగా ఆయన సినిమా రంగానికి దూరమయ్యారు. తనకు ఎంతో ఇష్టమైన గణిత రంగంపై మక్కువ చూపారు. భమిడిపాటి రాధాకృష్ణ క్యాలెండర్ పేరిట క్రీస్తుపూర్వం 45 నుంచి క్రీస్తుశకం 5555 వరకు అంటే ఆరు వేల సంవత్సరాల క్యాలెండర్ రూపొందించారు. జ్యోతిష రంగంలో కూడా ఆయనకు పట్టు ఉంది. సంఖ్యాశాస్త్ర పరంగానే కాకుండా చిన్నారుల నామకరణ సమయంలో బియ్యంలో రాసే అక్షరాలను బట్టి కూడా ఆయన జాతకాలు చెబుతారనే పేరు సంపాదించు కున్నారు. ఆయన 79 సంవత్సరాల వయస్సులో రాజమండ్రి లో మరణించారు. భజంత్రీలు, దంత వేదాంతంబీ కీర్తిశేషులుబీ మన స్థత్వాలుబీ తరం-అంతరంబీ తదితర నాటకాలను ఆయన రచించారు. ఆత్మ గౌరవం (1965) (డైలాగ్స్ రచయిత)బీ మరపురాని కథ (1967)బీ కథానాయకుడు (1969)బీ అల్లుడే మేనల్లుడు (1970)బీ ఆడ జన్మ (1970)బీ బొమ్మా బొరుసా (1971)బీ రామ రాజ్యం (1973)బీ ఆడపిల్లల తండ్రి (1974)బీ అల్లుడొచ్చాడు (1976)బీ పొగరు బోతు (1976)బీ మనిషి రోడ్డున పడ్డాడు (1976)బీసాహస వంతుడు (1978)బీ షోకిల్లా రాయుడు (1979)బీ నారి నారి నడుమ మురారి తదితర చిత్రాలకు సంభాషణలు రాశారు.



జగిత్యాల జిల్లా ధర్మపురి గోదావరి సంతోషిమాత ఆలయం మెట్ల వరకు వరద ఉధృతి ఉంది. ఇప్పట్లో తగ్గే పరిస్థితి లేదు స్థానికులు సంతోష్ మాత దేవాలయ మెట్లపై నిలబడి వరద ఉధృతిని సూచిస్తున్నారు



జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ను వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన రెడ్డి జన సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు. ఈ సందర్భంగా వారిని అభినందించి, శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

## మున్సిపల్ కార్మికులకు రేన్ కోట్ల పంపిణీ



**జగిత్యాల సెప్టెంబర్ 03 (ప్రజామంటలు):** మున్సిపల్ పరిధిలో విధులు నిర్వహించే కార్మికులకు వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని రేన్ కోట్లను పంపిణీ చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్. జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు రేన్ కోట్లు పంపిణీ చేసిన సందర్భంగా జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ.... ఎండ వాననక నగర పరిశుభ్రతను కాపాడే కార్మికుల ఆరోగ్య దృశ్య ప్రతి సంవత్సరం వర్షాకాలంలో రేన్ కోట్లను అందించడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్క కార్మికుడు, కార్మికురాలు తన ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుకుంటారో అలాగే జగిత్యాల పట్టణాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచడంలో మీ పాత్ర కీలకమైనదని మీరు లేనిది మేము లేమని జగిత్యాల అండ్ గ్రీన్ సిటీగా మార్చడంలో మీరు ముందుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ కోఆప్షన్ మెంబర్స్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, శానిటేషన్ సిబ్బంది, జవానులు కార్మికులు పాల్గొన్నారు.

## జగిత్యాల విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన



**జగిత్యాల సెప్టెంబర్ 03 (ప్రజామంటలు):** పదోన్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ కు బదులుగా మెరిట్ కమ్ సీనియరీటిని విద్యుత్ శాఖలో అవలంబిస్తున్నారని ఆరోపిస్తూ ఎస్.సి., ఎస్.టి ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సబ్ డివిజన్ కార్యాలయం ఎదుట నల్లా బ్యాడ్జిలతో నిరసన తెలియజేసారు. రిజర్వేషన్ ప్రకారం పదోన్నతులు కల్పించాలని ఎస్.సి., ఎస్.టి విద్యుత్ శాఖ సంఘం నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కార్యదర్శి. యన్. బాలు నాయక్, ఏడీఈ జవహరలాల్ నాయక్, టి. తిరుపతి, ఎల్. ప్రకాష్, బి. భద్రయ్య, ఎన్. రాంజీ, బి. సదయ్య తదితరులు ఉద్యోగులు పాల్గొన్నారు.

## రాయికల్ మండలంలో వరద నీరు,పలు వంతెనలను పరిశీలించిన
### పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



**జగిత్యాల సెప్టెంబర్ 03 (ప్రజామంటలు):** రాయికల్ పట్టణంలోని పెద్ద చెరువు ఉదృతంగా ప్రవహించడంతో దెబ్బ తిన్న తూములు, మత్తడి ని పరిశీలించారు. అధికారులతో మాట్లాడి భవిష్యత్ లో ఇలాంటి పరిస్థితి రాకుండ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రాయికల్ మండలం లోని బోర్నపల్లి వంతెన వద్ద గోదావరి వరద ప్రవాహాన్ని పరిశీలించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి.

# రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం
## ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్



**ధర్మపురి సెప్టెంబర్ 03 (ప్రజామంటలు, రామ కిష్టయ్య సంగనభట్ల):** రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, రైతులకు ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల వరకు రుణాలను మాఫీ చేయడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధర్మపురి మండలం దోనూర్ గ్రామంలో 15 లక్షల వ్యయంతో, కమలాపూర్ గ్రామంలో 13 లక్షల వ్యయంతో, నేరెళ్ళ గ్రామంలో 34 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఎరువుల గోదాములను మంగళవారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ...రుణాలు మాఫీ కాని రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదని, రుణమాఫీ కాని రైతుల నుండి దరఖాస్తులు తీసుకోవడం జరిగిందని వాటిని త్వరలోనే పరిష్కరించి రుణ మాఫీ వారికి వర్తింప చేస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను వందకు వంద శాతం అమలు చేయడం జరుగుతుందని, ఈ ప్రాంతానికి సంబంధించి లిఫ్ట్ లను కూడా గత ప్రభుత్వ అనాలోచిత విధానాల వలన పూర్తిగా నిర్లక్ష్యానికి గురికావడం జరిగిందని, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి వాటికి మరమ్మతులు చేసి పునరుద్ధరిస్తామని, 2016 లో ప్రారంభమైన రోళ్ళ వాగును గత ప్రభుత్వ హయాంలో పూర్తి చేయలేదని, దానికి ఫారెస్ట్ డిపార్ట్మెంట్ నుండి కొన్ని ఇబ్బందులు ఉన్నట్లు తమ దృష్టికి తీసుకురావడం జరిగిందని, ఈ విషయాన్ని కూడా జిల్లా కలెక్టర్ తో మాట్లాడి దాన్ని కూడా పూర్తి చేస్తామని, అదే విధంగా పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం చేపట్టి ధర్మపురి నియోజకవర్గ ప్రాంత రైతాంగానికి నీరు అందిస్తామని తెలిపారు. రైతులకు మేలు చేసే ఇట్టి ఎరువుల గోదాములను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని, రైతులకు ఇబ్బందులు కలగకుండా ఎరువుల నిల్వలను అందుబాటులో ఉంచుకోవాలని, ఎరువుల విషయంలో ఎటువంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని, రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ డిసిఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, సంఘ ఉపాధ్యక్షులు షేర్ల రాజేశం, డైరక్టర్లు పెరుమాండ్ల ఎల్లాగౌడ్, జజాల లక్ష్మీ, పల్లి అశోక్, కుమ్మరి రవి, నక్క రాజు, దాసరి రత్న, నూర లక్ష్మి, జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్, జైన సహకార సంఘం అధ్యక్షుడు సౌల్ల నరేష్, నాయకులు సంగనబట్ల దినేష్ , సంగ నర్సింహులు, ప్రకాశ్ రావు, చిలుముల లక్ష్మణ్, వేముల రాజు, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## వీధిలైట్లు లేవు. వీధి కుక్కలతో జనం భయం.
### వీధిలైట్లు వేసి, కుక్కల కోతుల బెడద నుండి రక్షించండి



**వేలేర్ సెప్టెంబర్ 03 (ప్రజామంటలు):** వేలేరు మండల కేంద్రంలో గడ్డమీది శంకరయ్య, మాట్లాడుతూ అంబేద్కర్ సెంటర్లో నుండి మండల ఆఫీసు వరకు, వీధిలైట్లు లేక ఇబ్బంది. వేలేరు మండల కేంద్రంలో అంబేద్కర్ సెంటర్లో నుండి మండల ఆఫీసు వరకు, వీధిలైట్లు లేక ఇబ్బంది పడుతున్న గ్రామ ప్రజలు, గత నెల రోజుల నుండి రాత్రిపూట వీధిలైట్లు లేక చాలా ఇబ్బంది పడుతున్నారు, గతంలో ఐమాక్స్ లైట్లు, ఆడంబరంగా పెట్టేయడం జరిగింది, కానీ వాటిని పట్టించుకునే నాధుడే లేడు, గ్రామ కార్యదర్శి కి మరియు స్పెషల్, ఆఫీసర్ కు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడంలేదని, అంబేద్కర్ సెంటర్లోని, ప్రజలు వాపోతున్నారు. మరియు గ్రామంలో, కుక్కల బెడద చాలా ఉంది, దానికి తోడు, కోతుల బెడద విపరీతంగా అయింది, వాటి గురించి గత పాలకులు కూడా పట్టించుకోలేదు, అందుకే తక్షణమే, గ్రామంలో వీధిలైట్లు వేసి, కుక్కల కోతుల బెడద నుండి రక్షించాలని గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు. పడుతున్న గ్రామ ప్రజలు, గత నెల రోజుల నుండి రాత్రిపూట వీధిలైట్లు లేక చాలా ఇబ్బంది పడుతున్నారు, గతంలో ఐమాక్స్ లైట్లు, ఆడంబరంగా పెట్టేయడం జరిగింది, కానీ వాటిని పట్టించుకునే నాధుడే లేడు, గ్రామ కార్యదర్శి కి మరియు స్పెషల్, ఆఫీసర్ కు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడంలేదని, అంబేద్కర్ సెంటర్లోని, ప్రజలు వాపోతున్నారు. మరియు గ్రామంలో కుక్కల బెడద చాలా ఉంది, దానికి తోడు, కోతుల బెడద విపరీతంగా అయింది. వాటి గురించి గత పాలకులు కూడా పట్టించుకోలేదు. అందుకు తక్షణమే గ్రామంలో వీధిలైట్లు వేసి, కుక్కల కోతుల బెడద నుండి రక్షించాలని గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో గూటం పైడయ్య, మునిగడప కేదారి, బూర సదానందం, జన్నారపు రమేష్, ఫరీద్ పాషా, సూత్రపు దుర్గారాజు పాల్గొన్నారు. గ్రామ కార్యదర్శి రవి గారికి వివరణ కోరగా విద్యుత్ అధికారులు ఎల్సీ గ్రామపంచాయతీ ఇవ్వగా లైట్లు మరమ్మతులు చేపిస్తామని గ్రామంలో ఇంకా సమస్యలు ఉంటే త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ చేసిన జువ్వాడి నర్సింగరావు



**కోరుట్ల సెప్టెంబర్ 03 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని జువ్వాడి భవన్లో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 4 లక్షల 52 వేల 500 రూపాయల విలువగల 10 చెక్కులు, అందులో కోరుట్ల పట్టణానికి చెందిన 4 చెక్కులు, కోరుట్ల మండలానికి చెందిన 6 చెక్కులను మంగళవారం లబ్ధిదారులకు అందజేసిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని ఆయన అన్నారు. నిరుపేద ప్రజలు అనుకోకుండా అనారోగ్యాలకు గురైనప్పుడు వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను వెంటనే మంజూరు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జువ్వాడి నర్సింగరావుతో పాటు కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, ఉపాధ్యక్షులు నయీమ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంజిరెడ్డి, ఏలేటి మహిపాల్ రెడ్డి, వైస్ చైర్మెన్ వెంకటేష్, కౌన్సిలర్ ఏంబేరి నాగభూషణం, నాయకులు శీలం వేణుగోపాల్, అన్నం అనిల్, దాసరి రాజశేఖర్, ఎలిశెట్టి భూమారెడ్డి, పుప్పాల ప్రభాకర్, వసీం,మ్యాకల నర్సయ్య, ముత్యాల గంగాధర్, శ్రీరాముల అమరేందర్, యూత్ కాంగ్రెస్, కిసాన్ కాంగ్రెస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## వరద కాలువల నిర్మాణానికి కృషి చేస్తా
## కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వొడితల ప్రణవ్ బాబు



**జమ్మికుంట సెప్టెంబర్ 03 (ప్రజామంటలు):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీతోపాటు, పిట్టల వాడ, అంబేద్కర్ కాలనీ, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఏరియా లో,16 వ వర్డ్ ,మోతుల గూడెం, కాలనీ లో గత రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలతో నీట మునిగిన ఇండ్లను హుజరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్ సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు వరద భాదితులు ప్రణవ్ కు తమ సమస్యలు తెలియజేశారు. ప్రతి సంవత్సరం వర్షాలు వచ్చాయంటే ఇంట్లోకి నీళ్లు వచ్చి వస్తువులన్నీ తడిచిపోతున్నాయని, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ఎగువన ఉన్న మడిపల్లి, కొత్తపల్లి శ్రీరాముల పల్లి గ్రామాల నుండి వరద నీరు దిగువన ఉన్న హౌసింగ్ బోర్డ్ కాలనీలోకి వస్తున్నాయని . గతంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు వచ్చి వరద కాలువ నిర్మిస్తామని హామీ ఇచ్చారు తప్ప ఇప్పటివరకు పనులను ప్రారంభించలేదని కాలనీవాసులు ప్రణవ్ కు మొరపెట్టుకున్నారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి అండగా ఉంటుందని, వరద కాలువలు నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అందుబాటులో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు బాధితులకు సహాయ సహకారాలు అందించాలని అన్నారు. వోడితల ప్రణవ్ వెంట మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# వైరల్ జ్వరాలపై
## డాక్టర్ ఆడెపు హర్షిత సూచనలు



**కోరుట్ల సెప్టెంబర్ 03 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో విపరీతంగా వ్యాప్తి చెందుతున్న వైరల్ జ్వరాల నేపథ్యంలో, లిటిల్ స్టార్ పిల్లల హాస్పిటల్ డాక్టర్ ఆడెపు హర్షిత ప్రజలకు కొన్ని ముఖ్యమైన సూచనలను అందించారు. ఈ సూచనల్లో, డాక్టర్ ఆడెపు హర్షిత ముఖ్యమైన అంశాలను వివరించారు. పిల్లల ఆరోగ్యం కాపాడేందుకు, తక్షణ వైద్య సహాయం అందించడం చాలా అవసరం. జ్వరానికి గురైన పిల్లలకు వెంటనే సమర్థవంతమైన వైద్య సేవలు అందించండి. రోజూ సురక్షితమైన గోరువెచ్చని మంచినీరు మాత్రమే త్రాగడం అవసరం. ఇది జ్వరాలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అనవసర వైరస్‌లను అరికట్టడానికి, పిల్లల చేతులను సబ్బుతో తరచుగా కడగడం అలవాటు చేయండి. ఇంట్లో దోమల నుండి రక్షణ కోసం మాస్కిటో నెట్ వాడండి. ఇది దోమల ద్వారా వచ్చే వైరస్‌లను నిరోధించడంలో సహాయపడుతుంది. బయట చేసిన అపరిశుభ్రమైన ఆహార పదార్థాలను తినవద్దు. ఈ సూచనలను పాటించడం ద్వారా వైరల్ జ్వరాలను నియంత్రించడంలో మరియు పిల్లల ఆరోగ్యం కాపాడటంలో సహాయపడవచ్చని డాక్టర్ ఆడెపు హర్షిత అన్నారు. మరిన్ని వివరాలకు మరియు వైద్య సలహాలకు, కోరుట్లలో లిటిల్ స్టార్ పిల్లల హాస్పిటల్ ని సంప్రదించండి.

## ఓరుగల్లు ఎలక్ట్రానిక్స్ టెక్నీషియన్ యూనియన్ ఎన్నికలు
### అధ్యక్షులుగా వూకంటి మహేందర్




**వేలేరు సెప్టెంబర్ 03 (ప్రజామంటలు):** హనుమకొండ లోని టీటీడీ కళ్యాణ మండపంలో ఈరోజు జరిగిన ఓరుగల్లు ఎలక్ట్రానిక్స్ టెక్నీషియన్ యూనియన్ ఎన్నికలలో అధ్యక్షులుగా వూకంటి మహేందర్, కార్యదర్శిగా దుప్పెటి శ్రీనివాస్, కోశాధికారిగా పాలడుగుల లక్ష్మణ కాంత్ ని సభ్యులు అందరూ కలిసి ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎలక్ట్రానిక్ టెక్నీషియన్లు పాల్గొన్నారు. సమన్వయకర్తగా బిక్కుమల్ల రవి ప్రసాద్, ఎన్నికల అధికారులుగా పిట్ట రాజేష్, సత్యనారాయణ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు మహమ్మద్ అంజద్ మాజీ కమిటీ సభ్యులు బలబద్ర మురళి, రెడ్డి భాస్కర్ రెడ్డి, ఎ. రవీందర్ కుమార్, తాటిపాముల శ్రీనివాస్, వనం సాగర్, కన్నబోయిన హరికృష్ణ, దాసి శోభన్, రామ్మోహన్, సదానందం, గోలనుకొండ మురళి సామల ప్రకాష్, వడికారి రాజు మరియు ఉమ్మడి జిల్లాలోని టెక్నీషియన్లు పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మహేందర్ మాట్లాడుతూ టెక్నీషియన్లకు ఎప్పుడు అందుబాటులో ఉండి వాళ్లకు అవసరమైన సేవలు అందిస్తానని తెలియజేశారు.

# ఉచిత సైకిళ్ళ పంపిణీ కార్యక్రమం




**కోరుట్ల సెప్టెంబర్ 03 (ప్రజామంటలు):** లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల మరియు కోటి నవదుర్గ సంయుక్తంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కోరుట్ల యందు దూర ప్రాంతాల నుంచి వచ్చే నలుగురు బాలికలకు వారి యొక్క అవసరాల నిమిత్తం నాలుగు సైకిల్ లను పంపిణీ చేయడం జరిగింది. గుంటుక లహరీష్, గుంటుక సురేష్ బాబు ప్రసన్నలక్ష్మీ కుమారుడు ఇట్టి సైకిల్ పంపిణీ కార్యక్రమంనకు దాతలుగా వ్యవహరించారు. ఇట్టి కార్యక్రమానికి రెండు క్లబ్ ల అధ్యక్షులు కుందారపు మహేందర్, పోతని శ్రీలత, కార్యదర్శి శ్రీగద్దె నరేందర్, కోశాధికారులు కొమ్ముల జలపతి రెడ్డి, మంచాల రోజారమణి, రీజన్ చైర్మన్ పోతని ప్రవీణ్ కుమార్, జోన్ చైర్మన్ ఆడెపు కమల, డిస్ట్రిక్ట్ లీడర్ ఆడెపు మధు, లయన్ అన్నం అనిల్, లయన్ మంచాల జగన్, పోల రఘునందన్, గుంటుక మహేష్, గుంటుక వందన, మండల విద్యాధికారి గంగుల నరేష్, మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముక్కెర చంద్రశేఖర్, శికారి రామకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ మోహన్ మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థుల బృందం పాల్గొనడం జరిగింది.

# లబ్ధిదారులకు సిఎం. సహాయ నిధి చెక్కుల పంపిణీ



**రాయికల్ సెప్టెంబర్ 03 (ప్రజామంటలు):** రాయికల్ పట్టణ మరియు మండలానికి చెందిన 182 మంది లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 37 లక్షల 12 వేల రూపాయల విలువగల చెక్కులను రాయికల్ పట్టణం లో ఆర్.ఆర్. గార్డెన్స్ లో లబ్ధిదారులకు అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హను మండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి అచ్యుత రావు, పాక్స్ చైర్మన్ లు దీటి రాజిరెడ్డి, రాజలింగం, సీనియర్ నాయకులు కోల శ్రీనివాస్, గన్నె రాజీరెడ్డి, రవీందర్ రావు, పడిగేల రవీందర్ రెడ్డి, నారాయణ గౌడ్, మోహన్ రావు, సురేందర్ నాయక్, తాజా మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, వివిధ హోదాల్లో మాజీ ప్రజా ప్రతినిదులు, నాయకులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి నది పరివాహక గ్రామాలను పరిశీలించిన ఎస్పీ అశోక్ కుమార్



**వెల్గటూర్ సెప్టెంబర్ 03 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా వెల్గటూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోదావరి పరీవాహక గ్రామాలైన చేగ్యం, పశిగామా, ముక్కారావు పేట్, కోటిలింగాల వద్ద గల పుష్కర ఘాట్ గోదావరి యొక్క వరద ప్రభావాన్ని ఎస్పీ పరిశీలించారు. గోదావరి నది పరివాహక ప్రాంత మండలాలైన ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, రాయికల్, బీర్పూర్ ధర్మపురి, వెల్గటూర్ నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నదీ పరివాహక ప్రాంతంలోకి పశువులు, గొర్రెలు మెపడానికి, చేపలు పట్టడానికి వెళ్లకూడదని అన్నారు. రానున్న మూడు రోజులో కూడా వర్షాలు ఉన్న దృష్ట్యా అవసరమైతే తప్ప బయటకి రాకూడదని సూచించారు. వర్షాలకు కల్వర్టు, చిన్న చిన్న బ్రిడ్జి ల వద్ద నీరు ప్రవహిస్తున్నప్పుడు వాహనాలతో దాటడానికి సాహసం చేయరాదు అని సూచించారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 నెంబర్ కి కాల్ చేసి పోలీసుల సహాయం పొందవలసిందిగా సూచించారు. ఎస్పి వెంట డిఎస్పి రఘు చంధర్, ధర్మపురి సి.ఐ. రామ్ నరసింహారెడ్డి, ఎస్.ఐ. ఉమాసాగర్ ఉన్నారు.

# సీ.యం.సహాయ నిధికి

## రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఒక రోజు వేతనం విరాళం



**జగిత్యాల సెప్టెంబర్ 3(ప్రజా మంటలు) :** ఇటీవల రాష్ట్రంలో తుఫాను ప్రభావం వల్ల కురిసిన తీవ్ర వర్షాల వాళ్ళ ప్రజలకు మరియు ప్రభుత్వానికి తీవ్ర ఆర్థిక నష్టం సంభవించిన దృష్ట్యా తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ మరియు సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఒకరోజు వేతనాన్ని ముఖ్య మంత్రి సహాయ నిధికి విరాళంగా ఇవ్వటానికి తీర్మానం చేస్తూ సెప్టెంబర్ నెల జీతం లో ఒక రోజు వేతనం ఇస్తున్నట్లు తీర్మాణ పత్రాన్ని గౌరవ ముఖ్యమంత్రి కి అందజేయటం జరిగినదని టీఎన్జీవో జగిత్యాల జిల్లా అధ్యక్షుడు భోగ శశిధర్ మరియు జిల్లా కార్యదర్శి మిర్యాల నాగేందర్ రెడ్డి తెలిపారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

## మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్



**జగిత్యాల సెప్టెంబర్ 03 (ప్రజామంటలు):** మున్సిపల్ ఛైర్పర్సన్ 1వ వార్డులో నీరు నిలిచి ఉన్న ప్రదేశములలో సందర్శించి నీటి నిల్వలను జే.సి.బి ద్వారా తొలగించారు. అలాగే యవార్ రోడ్డు మరియు బైపాస్ రోడ్డు లకు సందర్శించి మరమత్తులు చేయించారు. ఈ సందర్భముగా ఛైర్పర్సన్ మాట్లాడుతూ భారీ వర్షాలు పడుతున్న దృష్ట్యా ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పనుల నిమిత్తం మున్సిపల్ అధికారులకు సమాచారం అందిస్తే వెంటనే చర్యలు చేపడుతామని తెలిపారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న దృష్ట్యా నీటి నిలువలలో ఆయిల్ బాల్స్ వేయాలని, దోమల నివారణ స్ప్రే మరియు పాగింగ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వీరి వెంట మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వార్డు కౌన్సిలర్ అనిల్, అధికారులు, కార్మికులు ఉన్నారు.

# ఆదిత్య ఆసుపత్రిలో ఉచితంగా ఫైబ్రోస్కాన్ పరీక్షలు



**కోరుట్ల సెప్టెంబర్ 03 (ప్రజామంటలు):** కోరుట్ల పట్టణంలోని ఆదిత్య ఆసుపత్రిలో మంగళవారం కాలేయ వ్యాధి నిర్ధారణ ఫైబ్రోస్కాన్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. పెద్ద పెద్ద పట్టణాల్లో అందుబాటులో ఉండే రూ. 6,500 విలువగల ఫైబ్రోస్కాన్ పరీక్షలు పరిసర ప్రజల సౌకర్యార్థం ఉచితంగా నిర్వహించినట్లు ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వి. రంగనాథ్ తెలిపారు. జంక్ ఫుడ్స్, ఆయిల్ ఫుడ్ తినకుండా కాలేయాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని ఆయన తెలిపారు. కాలేయ వ్యాధి లక్షణాలు ఉన్న వారు మందు,మాంసంకు దూరంగా ఉండాలని డాక్టర్ రంగనాథ్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి నిర్వాహకులు ఎండి ఇక్బాల్, ఆరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

# నాలుగు నెలలుగా జీతాలు లేవు

## మంత్రి రాజనర్సింహ కు ఔట్ సోర్సింగ్ ఫోర్త్ క్లాస్ సిబ్బంది మొర



**సికింద్రాబాద్ సెప్టెంబర్ 03 (ప్రజామంటలు):** గాంధీ ఆసుపత్రిలో ఔట్ సోర్సింగ్ ఫోర్త్ క్లాస్ సిబ్బందిగా పనిచేస్తున్నామని, గత నాలుగు నెలల నుంచి తమకు తమ కాంట్రాక్టర్ జీతాలు చెల్లించడం లేదని గాంధీ ఆసుపత్రి ఔట్ సోర్సింగ్ సిబ్బంది హెల్త్ మినిస్టర్ దామోదర రాజనర్సింహ కు మొర పెట్టుకున్నారు. మంగళవారం గాంధీ కి వచ్చిన మినిస్టర్ ను కలిసిన ఫోర్త్ క్లాస్ సిబ్బంది ఈసందర్భంగా తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందచేశారు. సాయి సెక్యూరిటీస్, సైరా, సహస్ర అనే కంపెనీల కాంట్రాక్టర్ లు తమకు జీతాలు ఇవ్వకుండా, పీఎఫ్ జమ చేయకుండా నానా ఇబ్బందుల పాలు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ ఆసుపత్రిలో గత 20 ఏండ్లుగా తక్కువ జీతాలకే పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని వారు మంత్రిని వేడుకున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కొందరు నర్సింగ్ సిబ్బంది కూడ మంత్రిని కలిసి, వినతిపత్రం అందచేశారు. స్పందించిన మంత్రి సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామినిచ్చారు.

# ప్రాణాలు పోయినా పర్వలేదు.. ఫార్మాసిటీకి భూములు ఇవ్వం



**సంగారెడ్డి జిల్లా (ప్రజా మంటలు) :** ఫార్మాసిటీ వద్దే వద్దు.. తమకు జీవనాధారమైన భూములను ఇచ్చేది లేదంటూ సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలంలోని వడ్డి, డప్పూర్, మల్గి గ్రామాలకు చెందిన భూ బాధితులు, ప్రజలు ఆందోళనకు దిగారు. మంగళవారం మండల కేంద్రమైన న్యాల్కల్లోని ప్రధాన వీధు ల గుండా ఆయా గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, భూబాధితులు, ప్రజలు భారీ ర్యాలీ చేపట్టా రు. అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయ పరిసరాల్లోని న్యాల్కల్-ముంగి ప్రధాన రోడ్డు మార్గంలో రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాణాలు పోయినా పర్వలేదు. ఫార్మాసిటీకి భూములు ఇవ్వలేమన్నారు. తమ గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసే ఫార్మాసిటీతో ఈ ప్రాంతమే విషపూరితమయ్యే ప్రమాదముందని తెలిపారు. పచ్చని పొలాల్లో ఫార్మాసిటీ పేరుతో కోట్లాది రూపాయలు దండుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వం భూములు లాక్కునే ప్రయత్నం చేస్తే ప్రాణాలైనా ఇస్తామని, వాటిని మాత్రం వదులుకునేది లేదని, ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడితే భయపడేదిలేదని స్పష్టం చేశారు. తమ గ్రామాల పరిధిలో ఫార్మాసిటీ ఏర్పాటు చేసే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలన్నారు. అనంతరం తహసీ ల్దార్ భూపాల్ను కలిసి ఫార్మాసిటీకి భూములు మాత్రం ఇచ్చేది లేదంటూ వినతి పత్రాన్ని అందజేశారు.

# 'చలో విద్యుత్ సౌధ' ను విజయవంతం చేయండి



**జగిత్యాల సెప్టెంబర్ 03 (ప్రజామంటలు):** హైదరాబాద్ లో ఓసి బీసీ జేఏసీ ఆధ్వర్యంలో జరిగే మహా దర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యుత్ శాఖ ఓసి బీసీ జేఏసీ నాయకులు అన్నారు. బుధవారం జరిగే చలో విద్యుత్ సౌధ కార్యక్రమం పోస్టర్ ను జగిత్యాల పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం మధ్యాహ్నం 3:00 గంటలకు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... సుప్రీంకోర్టు తీర్పును ధిక్కరిస్తూ ప్రమోషన్లు కల్పిస్తున్నారని వెంటనే మెరిటీ సీనియారిటీ మాదిరిగా ప్రమోషన్లు కోర్టు తీర్పు అనుకూలంగా కల్పించాలని కోరారు. సంబంధిత అధికారులు వెంటనే తమ సమస్యలు పరిష్కరించకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఓసి, బీసీ జిల్లా నాయకులు అశోక్ రెడ్డి, రహీం, శ్రీధర్, ప్రమోద్, ప్రసాద్, వరుణ్ కుమార్, హరీష్, శ్రీనివాస్ రెడ్డి, గంగన్న, రాజమల్లు, మధు, ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల రక్షణకి షి టీమ్

## జెడ్పిహెచ్ఎస్ టిఆర్ నగర్ లో షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థినీలను అవగాహన



**జగిత్యాల సెప్టెంబర్ 03 (ప్రజామంటలు):** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జెడ్పిహెచ్ఎస్ టిఆర్ నగర్ జగిత్యాలలో షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా.... షీ టీమ్ ఏ.ఎస్.ఐ. మాట్లాడుతూ.... మహిళలు రక్షణకు షీ టీం ప్రత్యేకంగా పనిచేస్తుందన్నారు. విద్యార్థినులను వేధింపులకు గురిచేసిన, ర్యాగింగ్ చేసిన కఠిన చర్యలు ఉంటాయని స్కూల్లో, కళాశాలలో, బస్టాప్ ఇతర నిర్మాణ ప్రాంతాలు ఎవరైనా అమ్మాయిలను వేధిస్తే షీ టీం పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్ 8712670783 కు లేదా డయాల్ 100 కు కాల్ చేయాలన్నారు. ఈ సందర్భంగా గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్, చైల్డ్ మ్యారేజ్, డయల్ 100 ఇన్ ఎమర్జెన్సీ పై అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్, ఏఎస్ఐ వాలీబేగ్, మహిళా కానిస్టేబుల్స్ సౌజన్య, పూజిత, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ఏసీపి ప్రశాంత్ రెడ్డి ని పరామర్శించిన అంబాల ప్రభాకర్



**జమ్మికుంట సెప్టెంబర్ 03 (ప్రజామంటలు):** కమలాపూర్ మండలం శనిగరం గ్రామానికి చెందిన ఏసిపి పింగిలి ప్రశాంత్ రెడ్డి తండ్రి పింగిలి జగన్మోహన్ రెడ్డి పది రోజుల క్రితం గుండెపోటుతో మరణించగా విషయం తెలుసుకున్న ప్రముఖ చిత్రకారుడు అంబాల ప్రభాకర్ (ప్రభు) మంగళవారం రోజు తమ నివాసానికి వెళ్లి వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇనుగాల సతీష్, మేకల శివ, ఇనుగాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# దాడులకు హరీశ్ రావు ఎపుడు భయపడడు



**హైదరాబాద్ సెప్టెంబర్ 03 (ప్రజా మంటలు) :** వరద బాధితులను పరామర్శించటానికి వెళ్ళిన మాజీమంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు బృందం పైన జరిగిన దాడిని బి ఆర్ ఎస్ నాయకులు నగేష్ ముదిరాజ్ ఖండించారు. తుమ్మల మనుషులు గుండాలుగా ప్రవర్తిస్తూ, రాళ్ల దాడి చేయడం పై సీఎం బాధ్యత వహించాలి. ప్రజలకు వరద బాధితులకు సహాయం చేయడం చేతకాక తక్షణ సహాయం చేస్తున్న బిఆర్ ఎస్ నాయకుల పైన దుర్బుది తో భూతికదాడులకు పాల్పడడం హేయమైన చర్య అని, అదీ పోలీస్ ల సమక్షంలో దాడులకు పాల్పడడం పక్కా ముందస్తు ప్రణాళిక గానే పరిగణించాలని, దీనిపై ప్రభుత్వం స్పందించి, బాధ్యయలపై కఠిన చర్యలు తీసుకోవల్లని నగేష్ డిమాండ్ చేశారు.

## ఆస్తి, ప్రాణ నష్టం వివరాలను ఈ వారాంతంలోగా సమర్పించాలి..




హైదరాబాద్ (ప్రజా మంటలు) : రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన ఆస్తి, ప్రాణ నష్టం వివరాలను ఈ వారాంతంలోగా సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు.వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టం అంచనా వేయడంపై సచివాలయంలో వివిధ శాఖల కార్యదర్శులు, హెచ్ఓడీలతో సీఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటికీ అనేక జిల్లాల్లో వరదలు, వానలు తగ్గుముఖం పట్టలేదని సీఎస్ పేర్కొన్నారు.జరిగిన నష్టాన్ని వెంటనే అంచనా వేయడానికి సంబంధిత శాఖల బృందాలను క్షేత్ర స్థాయికి పంపి, తగు జీపీఎస్ కోఆర్డినేట్‌లతో సహా సమర్పించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతీ జిల్లాలో స్టేట్ డిజాస్టర్ మేనేజ్మెంట్ బృందాలను ఏర్పాటు చేయడానికి కావాల్సిన నిధులు, సిబ్బంది, పరికరాల వివరాలు వెంటనే సమర్పించాలన్నారు. ఈ వర్షాలు, వరదల వల్ల ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా వెంటనే తగు చర్యలు చేపట్టాలని సీఎస్ శాంతికుమారి ఆదేశించారు.భారీ వర్షాలు, వరదలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి. పలు జిల్లాల్లో వానలు, వరదలు పెను బీభత్సం సృష్టించాయి. ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, ఇతర జిల్లాల్లో వర్షాలు భారీగా కురిశాయి. పలు చెరువులకు గండ్లు పడి, ఆ నీళ్లు వాగుల్లో చేరి వంతెనలు తెగిపోయాయి. పలు చోట్ల రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వందల కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బీ రోడ్లు ధ్వంసమయ్యాయి.కరెంట్ స్తంభాలు కూలడం, వైర్లు తెగిపడడం, విద్యుత్ సబ్‌స్టేషన్లలోకి నీళ్లు చేరడంతో ట్రాన్స్‌కోకు కూడా భారీ నష్టం వాటిల్లింది. లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది.

## వందేళ్లలో రాని వరద..ఖమ్మం జిల్లాలో 48 వేల ఎకరాల్లో పంట నష్టం



హైదరాబాద్ (ప్రజా మంటలు) : కాంగ్రెస్ పార్టీ హామీ మేరకు రుణమాఫీ చేశామని.. 22 లక్షల రైతుల ఖాతాల్లో రూ. 18 వేల కోట్లు జమ చేశామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.ఇంకా మరి కొంతమంది రైతులకు రుణమాఫీ చేస్తామని మంత్రి తెలిపారు. ఈ సంతోష సమయంలో వరదల రూపంలో ఉపద్రవం వచ్చి పడిందని ఆయన పేర్కొన్నారు. మున్నేరు నదికి భారీ వరద వచ్చిందని.. వందేళ్లలో రాని వర్షం, వరద వచ్చినట్లు తుమ్మల చెప్పారు. ఇరిగేషన్ వ్యవస్థలు దెబ్బ తిన్నాయని తెలిపారు. ప్రస్తుతం పత్తి పూత మీద ఉందని, వరి చాలా వరకు దెబ్బతిందని.. అధికారులను నష్టంపై సర్వే చేయమని ఆదేశించామన్నారు.ఎక్కువగా ఖమ్మం జిల్లాలో ఆ తరువాత సూర్యాపేట, మహబూబాబాద్‌లో నష్టం జరిగిందన్నారు. ఖమ్మం జిల్లాలో 48000 ఎకరాల వరకు పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారం మేరకు తెలిసిందన్నారు. రైతులు పంటలు వేసుకునేందుకు విత్తనాలు సిద్ధంగా ఉంచామన్నారు. ఎరువులు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు. ఐదు రోజుల పాటు జిల్లాలోనే ఉన్నానని మంత్రి తెలిపారు. మున్నేరు పల్లపు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయన్నారు. అన్ని ప్రాంతాల్లో వరద బాధితులకు మంచి నీళ్లు, బియ్యం, వంట సామాగ్రి, పాలపాకెట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. టెస్కో ద్వారా రెండు జతల బట్టలు, దుప్పట్లు బాధిత కుటుంబాలకు సరఫరా చేయనున్నామని వెల్లడించారు. ఇళ్లను కోల్పోయిన వారికి మళ్లీ ఇళ్లు ఇచ్చే కార్యక్రమం చేపడతామన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా, అధికార పక్షంలో ఉన్నా ప్రజల కోసమే పని చేశానన్నారు.

## ఏడుపాయల ఆలయం వద్ద మంజీరా నది ఉగ్రరూపం



హైదరాబాద్ సెప్టెంబర్ 03 (ప్రజా మంటలు) : మెదక్ జిల్లాలోని ఏడు పాయల ఆలయం వద్ద మంజీరా నది ఉగ్రరూపం దాల్చింది. అమ్మవారి గర్భగుడిలోనికి మంజీరా వరద ప్రవేశించింది. మంజీరా బ్యారేజ్ గేట్లు ఓపెన్ చేయడంతో భారీగా వరద వచ్చింది.అమ్మవారి ఆలయాన్ని మంజీరా ఏడు పాయలు చుట్టుముట్టాయి. గర్భగుడి మూసేయడంతో రాజగోపురంలో ఉత్సవ విగ్రహానికి అమ్మవారు పూజలు అందుకుంటున్నారు.గత కొన్ని రోజులుగా భారీగా వర్షాలు కురవడంతో మంజీరా బ్యారేజ్ నిండుకుండలా మారగా.. గేట్లను ఓపెన్ చేశారు. ఈ క్రమంలోనే మెదక్‌లోని ఏడుపాయల వనదుర్గా భవాని ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఇప్పటికే అమ్మవారి ఆలయం చుట్టూ మంజీరా నది ఉగ్రరూపం దాల్చింది. అమ్మవారి పాదాలను తాకుతూ ఏడు పాయలుగా చీలిపోయి ఆలయం ఎదుట పరవళ్లు తొక్కుతోంది. వరద ఉధృతి తగ్గిన తర్వాత యధావిధిగా భక్తులకు దర్శనం కల్పిస్తామని ఆలయ ఈవో తెలిపారు. వరదల కారణంగా మంజీరాలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు సూచించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు వనదుర్గ ప్రాజెక్టు వైపు వెళ్లకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉన్నాం



### కంట్రోల్ లోనే డెంగ్యూ జ్వరాలు
### డాక్టర్లు, మందుల కొరత లేకుండా చర్యలు
### గాంధీ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ చేసిన హెల్త్ మినిస్టర్
### వార్డుల్లోని పేషంట్లతో మంత్రి ఇంటరాక్ట్



సికింద్రాబాద్ సెప్టెంబర్ 03 (ప్రజామంటలు): రాష్ట్రంలో ఎక్కడా కూడ సీజనల్ వ్యాధులు చేయి దాటి పోలేదని, అన్నీ కంట్రోల్ లోనే ఉన్నాయని, డాక్టర్లు, మందుల కొరత లేకుండా ప్రభుత్వ పరంగా ప్రణాళిక బద్దంగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ అన్నారు. మంగళవారం మంత్రి దామోదర రాజనర్సింహ మంత్రి హెూదాలో మొదటి సారిగా గాంధీ ఆసుపత్రిని సందర్శించారు. ఈసందర్భంగా మంత్రి ఆసుపత్రిలోని వార్డుల్లో తిరిగి ఆకస్మిక తనిఖీలు చేశారు. ముందుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొ. రాజకుమారి, వైద్యాధికారులతో కలసి మంత్రి దామోదర రాజనర్సింహ, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చోంగ్తూ, డీఎంఈ డా.ఎన్.వాణీ లతో కలసి రివ్యూ సమావేశం నిర్వహించారు. ఆసుప్రతిలోని ప్రధాన సమస్యలు, కావాల్సిన సౌకర్యాలు, రోగులకు అందుతున్న వైద్య చికిత్స, శానిటేషన్, పేషంట్ల ఫుడ్డు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈసందర్భంగా మంత్రి గాంధీ వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. గాంధీకి వచ్చే పేద, మధ్య తరగతి ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. పేషంట్లకు ఇచ్చే ఫుడ్డును క్వాలిటీ గా ఇవ్వాలని, శానిటేషన్ పనులను సక్రమంగా చేయాలన్నారు. వీటిపై నిరంతర నిఘా పెట్టి పేషంట్లకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలో డాక్టర్లు ఎంత మంది డ్యూటీలో ఉన్నారు... వారి వివరాలను మంత్రి సూపరింటెండెంట్ ను అడిగి తెలుసుకున్నారు. నర్సింగ్ సిబ్బంది డయాగ్నస్టిక్ ,క్లినికల్ విభాగాలలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు, వైద్య పరికరాలు, యంత్రాలపై మంత్రి అడిగి తెలుసుకున్నారు.

### వార్డుల్లో పేషంట్ లతో మంత్రి ఇంటరాక్ట్....

అనంతరం మంత్రి , వైద్య శాఖ ఉన్నతాధికారులతో కలసి గాంధీలోని ఓపీ, ఐపీ వార్డుల్లో తిరిగి పేషంట్లను అడిగి వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్యం, సమస్యలు, సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు.ఓపీ బ్లాక్ లో నాట్కో ట్రస్ట్ కంపెనీ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో నడుస్తున్న హెల్ప్ డెస్క్ ను సందర్శించిన మంత్రి, అక్కడున్న పేషంట్ కౌన్సిలర్లు శ్రీలత, సుధా లను వారి డ్యూటీ, పేషంట్లకు ఏ విధంగా సహాయ పడుతున్నారన్న అంశాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం పేషంట్లను మంత్రి కలుసుకున్నారు. ఏ ఊరు మీది..ఏ అనారోగ్యంతో గాంధీకి వచ్చారు...వైద్యం ఎలా అందుతుంది...ఏమైనా సమస్యలు ఉన్నాయా..? అంటూ మంత్రి పేషంట్లతో మమేకమై అడిగి తెలుసుకున్నారు. ఓపీ బ్లాక్ లోని సర్టికల్, ఎక్స్ రే, ఎంఆర్ఐ స్కానింగ్, ఐపీ లోని జనరల్ మెడిసన్, సర్జికల్ వార్డుల్లో మంత్రి పర్యటించారు. అనంతరం అలుమ్ని భవనం సమీపంలో కొత్తగా రూ 79 కోట్లతో నిర్మించతలపెట్టిన గాంధీ మెడికల్ కాలేజీ విద్యార్థుల హాస్టల్ భవనాల నిర్మాణాలకు ప్రతిపాదించిన స్థలాలను గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.ఇందిర తో కలసి పరిశీలించారు. బాయ్స్, గర్ల్స్ వేర్వేరు హాస్టల్ భవనాల నిర్మాణాలకు సంబందించిన వివరాలను టీజీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు మంత్రికి వివరించారు. కార్యక్రమంలో గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఇందిర, డీఎంహెచ్వో డాక్టర్ వెంకట్, గాంధీ డిప్యూటీ సూపరింటెండెంట్ లు డాక్టర్ సునీల్, డాక్టర్ సుభోద్, ఆర్ఎంఓ వన్ డాక్టర్ శేషాద్రి, ఆయా విభాగాల హెచ్ఓడీలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### నేను గాంధీ లోనే పుట్టాను: మంత్రి దామోదర రాజనర్సింహ

గాంధీ మెడికల్ కాలేజీ గ్రౌండ్ లో మంత్రి దామోదర రాజనర్సింహ మీడియాతో మాట్లాడారు. తాను గాంధీ ఆసుపత్రి (పాత గాంధీ దవఖాన) లోనే పుట్టానని, ఇక్కడి సాదకబాధకాలు, వైద్యం, తదితర అంశాలపై తనకు పూర్తిగా అవగాహన ఉందన్నారు. తాను దళిత బిడ్డనని, గాంధీకి వచ్చే వాళ్ళు దొరల బిడ్డలు కాదని, దొరల బిడ్డలంతా కార్పొరేట్ ఆసుప్రతులకు వెళ్తారన్నారు. నిరుపేదలు మాత్రమే గాంధీకి వస్తారన్నారు. వీళ్ళంతా తన ప్రజలని అన్నారు. వీళ్ళంతా తన అక్క, చెల్లల్లు అని, వీళ్ళను సరిగా చూసుకోవడం నా బాధ్యత అని అన్నారు. చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న ఐవీఎఫ్ కేంద్రాన్ని వారం రోజుల్లో అందుబాటులోకి తెస్తామని, తానే స్వయంగా ఐవీఎఫ్ సెంటర్ ను ప్రారంభిస్తానని అన్నారు. ఐవీఎఫ్ సెంటర్ లో అవసరమైన ఎంబ్రాలజిస్ట్ ను నియమిస్తామన్నారు. దీర్ఘకాలికంగా ఒకే చోట తిష్టవేసుకొన్న వాళ్ళనే బదిలీ చేశామని, అంతా మాత్రాన ఆసుపత్రుల్లో డాక్టర్ల కొరత ఉందనడం సరికాదన్నారు. కొన్ని చోట్ల ఖాళీలు ఉండగా, కాంట్రాక్ట్ పద్దతుల్లో వైద్య సిబ్బందిని తీసుకుంటున్నామన్నారు. ఈనెల 14 లోపు వైద్య విద్యార్థుల భద్రతపై కేంద్రం అడిగిన వివరాలను పంపించడానికి అంతా సిద్దం చేశామన్నారు. కోల్ కతా లో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రంలో తమ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అన్ని రకాల భద్రత చర్యలు తీసుకుంటామని, 2008 యాక్ట్ ను సవరించడానికి రివ్యూ చేస్తున్నామన్నారు. ప్రతి 100 పడకలకు పైగా ఉన్న ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా సెక్యూరిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సోమవారం ఈమేరకు ఆసుపత్రులు, డాక్టర్ల భద్రతపై ఉన్నతాధికారులతో మీటింగ్ జరిగిందన్నారు. మెడికల్ స్టూడెంట్స్, పీజీ డాక్టర్ల హస్టల్ భవనాల నిర్మాణానికి త్వరలో తానే శంకుస్థాపన చేస్తానన్నారు. దీనికి ప్రభుత్వం రూ. 79 కోట్లను కేటాయించిందన్నారు. గాంధీ ఆసుపత్రి మెయిన్ బిల్డింగ్ 8వ ఫ్లోర్ లో ఏర్పాటు చేయనున్న అవయవ మార్పిడి కేంద్రాన్ని త్వరలో అన్ని సౌకర్యాలతో అందుబాటులోకి తెస్తామన్నారు. ఐవీఎఫ్ సెంటర్ ను ఎంసీహెచ్ బిల్డింగ్ లో ఏర్పాటు చేస్తామన్నారు.

## బీసీల ప్రాణాలు పోతున్న ప్రభుత్వం పట్టించుకోదా?



### కుల గణన చేపట్టాలి
### కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి
### బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్

సికింద్రాబాద్ సెప్టెంబర్ 03 ( ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. గత 10 రోజులుగా బీసీ డిమాండ్ల సాధనకు గాంధీ ఆసుపత్రిలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బత్తుల సిద్దేశ్వర్ ను ఆయన మంగళవారం కలిసి, పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ....గత పది రోజులుగా ప్రాణాలు తెగించి ఆమరణ దీక్ష చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రజా పాలన అంటే ఇదేనా..అని ప్రశ్నించారు. బీసీల ప్రాణాలు అంటే ప్రభుత్వానికి లెక్క లేదా..అని ప్రశ్నించారు. ఎన్నికల్లో బీసీ ఓట్లతో గెలిచి, అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలను విస్మరించడం అన్యాయమన్నారు. వెంటనే ప్రభుత్వం సమగ్ర కులగణన కోసం రోడ్ మ్యాప్ ప్రకటించాలని, రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలన్నారు. సిద్దేశ్వర్ దీక్షను విరమింపచేయాలని కోరారు. ఈ విషయమై ప్రభుత్వం అన్ని పార్టీలతో కలసి అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఆమరణ దీక్ష చేస్తున్న బత్తుల సిద్దేశ్వర్, చాపర్తి కుమార్ గాడ్గే ప్రాణాలకు ఏదేని హాని జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్ చారి, నాయకులు దానకర్ణ చారి, రామరాజు, రవికుమార్, చెన్నయ్య, పురుషోత్తం, రఘురామ్ పాల్గొన్నారు.

## నీట మునిగిన పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల వట్టెం పంప్ హౌస్ పరిశీలించిన

### రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి



హైదరాబాద్ సెప్టెంబర్ 03 (ప్రజా మంటలు) : ఒక్క రోజు కురిసిన కుంభ వృష్టి వర్షంతో పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల వట్టెం పంప్ హౌస్ నీట మునిగిన విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి పరిశీలించారు. నాగర్ కర్నూలు జిల్లా కేంద్రం కుమ్మర గ్రామ శివారులో ఉన్న వట్టెం పంప్ హౌస్ ప్రాంతాన్ని చిన్నారెడ్డి పరిశీలించి ఇంజనీర్లకు దిశా నిర్దేశం చేశాడు.మూడు రోజుల క్రితం ఒక్క రోజులో 14 సెంటి మీటర్ల వర్షం కురవడంతో వట్టెం పంప్ హౌస్ లో నీరు చేరి 5 పంప్ లు నీట మునిగిపోయాయి. నాగర్ కర్నూలు శివారులోని నాగనోల్ చెరువులోకి దాదాపు 50 చెరువుల నీళ్ళు అలుగు పారడంతో ఆ నీరు అంతా వట్టెం పంప్ హౌస్ లోకి చేరి భారీ పంప్ లను ముంచెత్తాయి. ఈ విషయం తెలుసుకున్న చిన్నారెడ్డి హుటా హుటిన వట్టెం పంప్ హౌస్ ప్రాంతానికి చేరుకుని ఇంజనీర్లు ఎస్. ఈ. సత్యనారాయణ రెడ్డి, ఈ ఈ పార్ధ సారథి, డీ ఈ లు సత్యనారాయణ గౌడ్, బాగయ్య లతో సమావేశమై పరిస్థితిని సమీక్షించిన అనంతరం సంఘటన స్థలాన్ని చిన్నారెడ్డి సందర్శించారు.ఈ ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మాణ సంస్థ ఇంకా ప్రభుత్వానికి అప్పగించనందున పంప్ హౌస్ లోని నీటిని ఎత్తి పోసి పంప్ లను పూర్వ స్థితికి తీసుకొచ్చే బాధ్యత నిర్మాణ సంస్థదే అని, ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారం పడదని చిన్నారెడ్డి తెలిపారు. ఈ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో జాగ్రత్తలు తీసుకోవాలని చిన్నారెడ్డి ఇంజనీర్లకు సూచించారు.వట్టెం పంప్ హౌస్ వద్ద ఉన్న ఒక్కో పంప్ 2,400 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేసే సామర్థ్యం ఉన్న 10 పంప్ లు ఈ ప్రాంతంలో బిగిస్తున్నారు.వట్టెం రిజర్వాయర్ 16 టీ ఎం సీ కృపాసిటీ సామర్థ్యంతో ఉంది.

## వరదలకు చనిపోయిన వారి విషయంలోనూ రేవంత్ అబద్ధాలు..

### మండిపడ్డ హరీశ్‌రావు



ఖమ్మం సెప్టెంబర్ 03 (ప్రజా మంటలు) : రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలకు చనిపోయిన వారి విషయంలోనూ సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు.చనిపోయిన వారి విషయంలో సంఖ్య తక్కువ చేసి చూపించే ప్రయత్నం చేస్తున్నారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.సీఎం రేవంత్ రెడ్డి 16 మంది చనిపోయినట్టు చెప్పారు. కానీ మా వద్ద స్పష్టంగా వివరాలు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలకు, వరదలకు 30 మంది చనిపోయిన వారి వివరాలు ఉన్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 11 మంది, మహబూబాబాద్‌లో 3, సూర్యాపేటలో ఇద్దరు, , ములుగులో ఇద్దరు, ఆదిలాబాద్‌లో ఒక్కరు, నారాయణపేటలో ఇద్దరు, నాగర్‌కర్నూల్‌లో గుర్తు తెలియని డెడ్ బాడీ దొరికింది. వనపర్తిలో ఒకరు, పెద్దపల్లిలో ఇద్దరు, కామారెడ్డిలో ఒకరు, సిద్దిపేటలో ఇద్దరు, రంగారెడ్డిలో ఇద్దరు చనిపోయారు. ప్రభుత్వం ఏమో 16 మంది అని చెబుతున్నారు. మరణాల విషయంలోనూ ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుందని హరీశ్‌రావు మండిపడ్డారు.భక్తరామదాసు, పాలమూరు ఎత్తిపోతల పంప్ హౌస్‌లు నీట మునిగాయి. దీనికి పూర్తిగా ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. 2 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ప్రభుత్వ యంత్రాంగం సకాలంలో స్పందించి ఉంటే వేల ఎకరాల్లో పంట నష్టం జరిగి ఉండకపోయేది. నష్టపోయిన పంటకు ఎకరానికి రూ. 30 వేలు ఇవ్వాలని గతంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రతి ఎకరాకు రూ. 30 వేలు ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. మీ తప్పిదం వల్ల సాగర్ కెనాల్ తెగిపోయింది. రైతులు బాధపడుతున్నారు. కన్నీళ్లు పెట్టుకున్నారని హరీశ్‌రావు తెలిపారు.అన్ని మేమే చేస్తే సీఎం కుర్చీలో నువ్వు ఎందుకు రేవంత్ రెడ్డి. రైతు రుణమాఫీ కాలేదంటే హరీష్ రావు ఇంటింటికి పోయి కాగితాలు జమచేసి తెచ్చి ఇవ్వాలంటాడు. కేంద్రం బడ్జెట్లో నిధులు కేటాయించకపోతే కేసీఆర్ వెళ్లి ఢిల్లీలో దీక్ష చేయాలంటాడు. వరదలు వచ్చినాయి సహాయం చేయండి అంటే బీఆర్ఎస్ వాళ్ళు చేయాలంటాడు. అన్ని మేమే చేస్తే సీఎం కుర్చీలో నువ్వు ఎందుకు రేవంత్ రెడ్డి? అని హరీశ్‌రావు నిలదీశారు.

## వరదబాధితులకు ఆహారం,నీరు నిరంతరంగా శ్రమిస్తున్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు

# సహాయక చర్యలపై చంద్రబాబు పర్యవేక్షణ





**విజయవాడ,సెప్టెంబర్3(ప్రజా మంటలు):** విజయవాడను పెద్ద ఎత్తున వరద ముంచెత్తడంతో.. ఏకంగా సీఎం చంద్రబాబు సహా మంత్రులు, అధికారులు అంతా విజయవాడలోనే తిష్ట వేసి మరీ వరద సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. బాధితులకు ఎప్పటికప్పుడు ధైర్యం చెబుతున్నారు. బాధితులకు మూడు పూటలా భోజనంతో పాటు వాటర్ సదుపాయం కల్పిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దింపి మరీ సహాయక చర్యలు బాధితులకు అందేలా చూస్తున్నారు. విపత్తు సమయంలో సరిగా పని చేయకుంటే ఎవ్వరినీ వదలబోనని సీఎం చంద్రబాబు తెలిపారు. మరోవైపు మంత్రి నారా లోకేష్ పర్యవేక్షణలో విజయవాడ వరద బాధితులకు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మంగళవారం సహాయక చర్యల్లో ఆరు హెలికాప్టర్ల ద్వారా ఆహారం, తాగు నీటిని సరఫరా చేశారు. బోట్లు చేరుకోలేని ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా ఆహార సరఫరా చేస్తున్నారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ విజ్ఞప్తి మేరకు జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీకి ప్రత్యేక హెలికాప్టర్‌లో 2,500 ఆహార పొట్లాలను చేరవేస్తున్నారు. విజయవాడ పరిధిలో వరద ముంపునకు గురైన 32 వార్డుల్లో సీనియర్ ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మంత్రి లోకేష్ పిలుపు మేరకు సహాయ చర్యల్లో రాష్ట్రం నలుమూలల నుంచి విజయవాడకు పార్టీ శ్రేణులు చేరుకున్నాయి. విజయవాడ డివిజన్ పరిధిలో 70 పునరావాస కేంద్రాల్లో 14,452 మంది నిరాశ్రయులు ఆశ్రయం పొందుతున్నారు. ప్రకాశం బ్యారేజి వద్ద వేగంగా వరద తగ్గుముఖం పడుతోంది. ప్రస్తుత వరద ప్రవాహం 8,71,776 క్యూసెక్కులకు









చేరుకుంది. మరోవైపు రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరద పరిస్థితులు, బాధితులకు అందుతున్న ఆహారం గురించి ఆరా తీశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తు న్నారు. తాగునీరు, ఆహారం ప్రతి ఒక్కరికి చేరాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న సహాయక చర్యల్లో కార్యకర్తలు పాల్గొనాలని సూచించారు. ఇప్పటికే మచిలీపట్నం నుంచి విజయవాడకు టీడీపీ కార్యకర్తలు చేరుకున్నారు. బాధితులకు అండగా నిలవాలని, భరోసా కల్పించాలని కార్యకర్తలందరికీ కొల్లు రవీంద్ర సూచించారు.

## అధికారుల నిర్లక్ష్యాన్ని సహించేది లేదు మంత్రులైనా సహాయక చర్యల్లో పాల్గొనాల్సిందే

## నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు, కఠినంగా హెచ్చరించిన చంద్రబాబు నాయుడు



**విజయవాడ,సెప్టెంబర్3(ప్రజా మంటలు):** వరద బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు అన్ని చర్యలూ చేపట్టామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. కొన్ని చోట్ల ఆహారం అందలేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విజయవాడ కలెక్టరేట్ వద్ద మీడియాతో సీఎం మాట్లాడారు. నగరంలో డివిజన్‌కు ఒక సీనియర్ ఐఏఎస్‌ను నియమించామని చెప్పారు. 32 మంది ఐఏఎస్ అధికారులు సహాయక చర్యల్లో ఉన్నారన్నారు. పది జిల్లాల నుంచి ఆహారం సమకూర్చామని.. బాధితులకు మూడు పూటలా అందించాలని ఆదేశించినట్లు చెప్పారు. చిట్టచివరి బాధితుడికి కూడా సాయం అందాలని స్పష్టం చేశారు. వరదలతో పేదల బాధలు వర్ణణాతీతం. కొన్ని ఇళ్లల్లోకి పాములు, తేళ్లు వచ్చాయి. దీంతో వారందరికీ బాధ, భయం ఉంటుంది. అధికారులంతా మానవతా దృక్పథంతో పనిచేయాలి. అందుతున్న సహాయంపై ఐవీఆర్ఎస్ నిర్వహిస్తున్నాం. కొన్ని ప్రాంతాలకు ఇంకా ఆహారం అందలేదని ఫిర్యాదులు వస్తున్నాయి. ఆహారం అందని బాధితుల నంబర్లు అధికారులకు పంపిస్తున్నాం. ఇబ్బందులపై ప్రజలు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలి. నేను కూడా ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నా.

అధికారులకు రెండు రోజులుగా చెప్పాం.. ఇప్పుడు సరిగా పనిచేయలేదని ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవు. మీనమేషాలు లెక్కించడం సరికాదు.. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు సర్వశక్తులూ ఒడ్డి సేవ చేయాలి. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికీ విజ్ఞప్తి చేస్తున్నా. ఈ కష్ట సమయంలో బాధితులకు అండగా నిలవాలి. ఏవిధంగా సహకారం అందించగలిగితే అలా చేయూత అందించాలి. ఆర్థికంగా, నిత్యావసరాలు, సహాయ కార్యక్రమాల్లో పాల్గొనడం.. ఇలా ఏది వీలైతే అది మీ శక్తిమేర చేయాలి. ప్రభుత్వం తరపున చేయాల్సిందంతా చేస్తాం. రెండు రోజు వరద ప్రభావిత ప్రాంతాల్లో చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మంత్రులు, అధికారులకు గట్టిగా హెచ్చరిక ఇచ్చారు. విపత్తు నిర్వహణలో సరిగ్గా పని చేయకుంటే, మంత్రులకైనా వేటు తప్పదని హెచ్చరిస్తున్నానని చంద్రబాబు తెలిపారు. జక్కంపూడిలో విధులు సరిగా నిర్వర్తించని ఓ అధికారిని ఇప్పటికే సస్పెండ్ చేశానన్నారు. వీఆర్‌లో పెట్టిన అధికారులు విపత్తు నిర్వహణ బాధ్యతల్లో సక్రమంగా విధులు నిర్వర్తించ లేదనే ఫిర్యాదులు ఉన్నాయన్నారు. దీనిపైనా విచారణ జరిపిస్తున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో వివాదాస్పద అధికారులకు బాధ్యతలు అప్పగింత మంచి ఉద్దేశంతో జరిగిందా? లేక ఓవర్ లుక్‌లో అయిందా? అనేది పరిశీలిస్తున్నామని చంద్రబాబు తెలిపారు.ఏ రకంగా బాధ్యతలు అప్పగించినా పని చేయాలనే మానవత్వం సదరు అధికారులకు ఉండదా? అని ప్రశ్నించారు. టోల్ ఫ్రీ నంబర్‌లు పనిచేయట్లేదనే ఫిర్యాదును అంగీకరిస్తున్నానని చంద్రబాబు తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థ 5ఏళ్లుగా పక్షవాతం వచ్చినట్లుగా పడి ఉందని ఒకింత అసహనం వ్యక్తం చేశారు. కొత్త కంట్రోల్ రూమ్ వ్యవస్థ పెట్టి వెంటనే సమస్య పరిష్కరిస్తానన్నారు. బ్యారేజీ వద్దకు బోట్లు ఎలా కొట్టుకొచ్చాయని విచారణ జరిపిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. తప్పుడు వార్తలు ఇచ్చి ఓ వర్గం మీడియా ఇంకా పరువు పోగొట్టుకోవద్దని హెచ్చరించారు. ఉదయం నుంచి జరిగిన ఆహారం పంపిణీ వివరాలను సీఎం చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా విధుల్లో ఉన్న అధికారులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. 5 హెలీకాప్టర్ల ద్వారా ఆహార పంపిణీ జరుగుతోందని సీఎంకు అధికారులు తెలిపారు. హెలికాప్టర్, పడవలు, ట్రాక్టర్ల ద్వారా ఉదయం నుంచి ఆహారం, నీళ్లు అందిస్తున్నామని వివరించారు. 5 లక్షల ఆహారం, నీళ్ళ ప్యాకెట్లు సిద్ధం చేసి పంపిణీ చేశామని చంద్రబాబుకు అధికారులు తెలిపారు.100 శాతం ఆహారం పంపిణీ జరగాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చేరుకోలేని చోటకు హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా మూడు పూటలా ఆహారం అందించాలని తెలిపారు. 36 డివిజన్లలో విధుల్లో ఉన్న అధికారులే ఆహార పంపణీకి బాధ్యత వహించాలని చంద్రబాబు ఆదేశించారు. ఆపద సమయంలో కుట్రలు జరుగుతున్నాయి. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వారిని ఆదుకోవాలి.. చెత్త రాజకీయాలు వద్దు. ఈ పరిస్థితుల్లో గుడ్లవల్లేరు ఘటనపై ఫోకస్ చేస్తారా? ప్రకాశం బ్యారేజీలో బోట్ల ఘటనపై విచారణ చేపడతాం. ఇటీవల కొన్ని ఘటనలు అనుమానాస్పదంగా ఉన్నాయి. బాబాయ్‌నే చంపిన వారు ఉన్నప్పుడు అనుమానాలు వస్తాయి కదా! విపక్ష నేత ఐదు నిమిషాలు వచ్చి షో చేసి వెళ్లారు. ఆయన ఒక్కరికి కూడా ఆహార పొట్లం ఇవ్వలేదు.ప్రధాని మోదీతో మాట్లాడినప్పుడు మీరున్నారు కదా.. భయం లేదని చెప్పారు. హుద్‌హుద్ సమయంలో నా పనితీరును ఆయన మెచ్చుకున్నారు. నా పట్ల ప్రజల స్పందన చూసి ప్రధాని ఆశ్చర్యపోయారు‘ అని చంద్రబాబు అన్నారు. విజయవాడ పర్యటనలో భాగంగా సితార సెంటర్‌కు సీఎం చంద్రబాబు చేరుకున్నారు. జేసీబీ ఎక్కి వరద కాలనీల్లో పరిస్థితి పరిశీలించారు. ఆహారం అందుతుందా..? లేదా..? అని బాధితులను అడిగి తెలుసుకుంటున్నారు. స్వయంగా ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకుంటున్నారు. ప్రజల నుంచి వచ్చే స్పందన ఆధారంగా అధికారులపై చర్యలు ఉంటాయని చంద్రబాబు తెలిపారు.

## వరద సహాయక చర్యల్లో పోలీస్ కమిషనర్.. 10 రోజుల పసి పాపను కాపాడిన సీపీ..



**విజయవాడ,సెప్టెంబర్3(ప్రజా మంటలు) :** విజయవాడలోని చాలా ప్రాంతాలు ఇంకా వరదనీటిలోనే మగ్గుతున్నాయి.. సీఎం చంద్రబాబు నాయుడు నుంచి.. మంత్రులు.. ఎమ్మెల్యేలు.. ప్రజా ప్రతినిధులు..ఐఏఎస్‌లు.. ఐపీఎస్‌లు.. ఇతర పోలీసు సిబ్బంది.. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది.. ఇలా అంతా వరద సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు.. ఇక, 10 రోజుల పసి పాపను స్వయంగా రక్షించి పునరావాసా కేంద్రానికి తరలించారు విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు..ఎన్టీఆర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో సీపీ రాజశేఖర్ బాబు.. వరద ఉధృతిని పర్యవేక్షిస్తూ.. ఎన్డీఆర్ఎఫ్ మరియు ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు, ఫైర్ మరియు పోలీసు లా అండ్ ఆర్డర్ అధికారులు.. సిబ్బంది సహకారంతో లోతట్టు ప్రాంతాలలో సహాయక చర్యలతో నీట మునిగిన ప్రాంతాల నుండి ప్రజలను రక్షించి పునరావాసాలకు తరలించేందుకు చర్యలు చేపట్టారు.. ఈ క్రమంలో రెండవ రోజు సింగ్ నగర్, నున్న పరిసర ప్రాంతాలు ఇబ్రహీంపట్నం ఏరియాలలోని నీట మునిగిన ప్రాంతాల్లోకి స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయిలో అధికారులకు సూచనలిస్తూ .. సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ క్రమంలో వరదలో చిక్కుకున్న 10నెలల బాలికను.. వారి కుటుంబ సభ్యులను బోట్ సహాయంతో స్వయంగా బయటకు తీసుకువచ్చారు.. వృద్దులను, మహిళలను స్వయంగా రక్షించి పునరావాస కేంద్రాలకు తరలించారు.. భవానీపురం, చిట్టీనగర్ మరియు వై.ఎస్.ఆర్ కాలనీ ఏరియాలలోని నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించి.. వారికి అందుతున్న సహాయక చర్యల గురించి అడిగి తెలుసుకుని అధికారులకు తగు సూచనలు చేశారు సీపీ రాజశేఖర్ బాబు..

## ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

# కోటి విరాళం



**విజయవాడ,సెప్టెంబర్3(ప్రజా మంటలు):** ఆంధ్రప్రదేశ్లో వర్షాల కారణంగా చాలా ప్రాంతాలు వరదలతో ఇబ్బంది పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే విజయవాడ లాంటి చోట్ల చాలా ప్రాంతాలు నీట మునిగాయి.ముఖ్యమంత్రి చంద్రబాబు సహా ప్రభుత్వ యంత్రాంగం, లోకల్ లీడర్లు వారికి సహాయం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇక ఈ నేపథ్యంలో తాజాగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధికి కోటి రూపాయల విరాళం ప్రకటించారు.ప్రస్తుతం రాష్ట్ర విపత్తు నిర్వహణ కమిషనర్ కార్యాలయంలో ఆయన వరద ప్రభావిత ప్రాంతాల పరిస్థితిలను పరిశీలిస్తున్నారు. రాష్ట్ర హెూమ్, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి సిసోడియాతో పాటు అందుబాటులో ఉన్న ఇతర ముఖ్య ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఇక ఆంధ్రప్రదేశ్లో వరద బీభత్సానికి చాలా మంది ప్రాణాలు కోల్పోగా వేల మంది ఆశ్రయాన్ని కోల్పోయిన పరిస్థితి కనిపిస్తోంది. ఈ నేపద్యంలో ఎన్నారైలు, ఉద్యోగులు ముఖ్యమంత్రి సహాయనిధికి తమకు తోచినంత సాయం చేస్తున్నారు. ముఖ్యంగా సినీ పరిశ్రమ నుంచి కూడా దాదాపుగా మూడు కోట్లకు పైగా విరాళాలు ఇప్పటికే ప్రకటించారు

## వైద్య ఆరోగ్య శాఖ 154 మంది గర్భిణులు.. అత్యవసర కిట్లు పంపిణీ..



**విజయవాడ,సెప్టెంబర్3(ప్రజా మంటలు) :** వరదల్లో చిక్కుకున్న గర్భిణిలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది.. తదుపరి 10 రోజుల్లో ప్రసవించే 154 మంది గర్భిణిలను వైద్య ఆరోగ్య శాఖ సురక్షిత ప్రాంతాలకు చేర్చిందని వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు.. వైద్య ఆరోగ్య శాఖ ప్రజలకు అత్యవసర ఆరోగ్య సేవల్ని అందించేందుకు అనేక కార్యక్రమాల్ని చేపట్టిందన్నారు. పునరావాస కేంద్రాలకు అనుబంధంగా 14 వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించడంతో పాటు వీటికి అదనంగా 20 సంచార వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేసి వైద్య సేవల్ని అందించిందన్నారు. ఈ వైద్య శిబిరాల ద్వారా ఇప్పటివరకు 17,538 మంది రోగులు సేవలు పొందారని వివరించారు..భారీ వర్షాలు.. వరదలతో విజయవాడ నగరంలో పలు ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకోవడంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాల్ని చేపట్టి, ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించి తగిన వసతుల్ని కల్పించిందని పేర్కొన్నారు కృష్ణబాబు.. సీఎం చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేస్తున్నారన్నారు. విజయవాడ నగరంలో 32 వార్డ్స్ జలదిగ్బంధం లో చిక్కుకొన్న దృష్ట్యా అందరకి 6 రకములైన అత్యవసరమైన మందులను, వాటిని వాడే విధానం తెలియచేసే కర పత్రాన్ని జత చేస్తూ సుమారు 75,000 కిట్స్ ను హెలికాప్టర్ ద్వారా, బోట్స్ ద్వారా మరియు రోడ్డు మార్గములో అందించడం జరుగుతోందన్నారు. . అత్యవసర వైద్య సేవల కోసమై అదనంగా ఇరవై అయిదు 108 అంబులెన్సులను అందుబాటులో ఉంచామన్నారు. వరదలతో వ్యాధులు పెరిగి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవల కోసమై వచ్చే రోగుల సౌలభ్యం కోసం అదనంగా 100 పడకలను ఏర్పాటు చేశామన్నారు. వివిధ కాలనీల్లో నీటిమట్టం తగ్గు ముఖం పడుతున్న దృష్ట్యా సంక్రమిత వ్యాధులు ప్రబలే అవకాశం వున్నందున విస్తారమైన వైద్య సహాయక ఏర్పాట్లు చేయడం జరుగుతోందన్నారు. వీటిలో భాగంగా 32 వార్డ్స్ లో 64 వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతోందని, ఈ వైద్య శిబిరాలలో రోగులకు అవసరమగు వైద్య పరీక్షలు చేసి ఉచితముగా మందులను అందిస్తారన్నారు వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు.

## తెగిన బుడమేరు కాలువ కట్ట.. ఎన్‌హెచ్ 16పైకి వరద నీరు..



**కృష్ణా జిల్లా సెప్టెంబర్3(ప్రజా మంటలు) :** కృష్ణా జిల్లా గన్నవరంలో గూడవల్లి వద్ద బుడమేరు కాలువ కట్ట తెగిపోయింది.. దీంతో.. బుడమేరు కాలువ నుంచి జాతీయ రహదారి 16పైకి వరద నీరు చేరుతుంది..నిడమానూరు నుండి గూడవల్లి వరకు జాతీయ రహదారిపైకి వరద నీరు చేరిపోయింది.. దీంతో.. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.. మరోవైపు.. రామన్ భవన్ 2 కాలేజీలోకి ప్రవేశించింది బుడమేరు వరద నీరు.. ఇంకోవైపు.. శ్రీ చైతన్య కాలేజీలోకి కూడా బుడమేరు వరదనీరు వచ్చి చేరింది.. దీంతో.. కాలేజీకి సెలవు ప్రకటించి.. విద్యార్థులను ఇంటికి పంపిస్తున్నారు చైతన్య కాలేజ్ యాజమాన్యం.. కాలేజీలో నుండి గూడవల్లి వద్ద జాతీయ రహదారిపైకి చేరుతోంది బుడమేరు కాలువలోని వరద నీరు.. జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు.. ఇలాగే వరద ఎక్కువ కొనసాగితే.. విజయవాడ నుండి ఏలూరు వెళ్లే జాతీయ రహదారిపై వాహనాలు బారులు తీరే ప్రమాదం ఉంది.. ట్రాఫిక్ క్లియరెన్స్ కష్టంగా మారే అవకాశం ఉందంటున్నారు అధికారులు..

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUG-GARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985 PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com